


## కొవ్వలి నవలల్లో కొన్ని...

‘కొవ్వలి’ అనే పేరు తెలుగు నవలా ప్రపంచంలో ఒక తరం పాఠకులకు చాలా చిరపరిచితం. ముఖ్యంగా మధ్య తరగతి వారిలో పఠనాభిలాషను పెంచిన రచయిత శ్రీ కొవ్వలి లక్ష్మీనరసింహారావు. అరవైయేళ్ళు నిండేనాటికి వెయ్యి నవలలు రాసిన ప్రతిభ ఆయనది. ఆనాటి పాఠకులనాడి తెలుసుకుని కళాత్మకంగా పాత్రల్ని మలుచుకుంటూ చమత్కారంగా కథని నడిపించే వారు. పెద్దలూ పిల్లలూ, ఆడవాళ్లూ మగవాళ్లూ విరగబడి చదివిన ఈ వెయ్యి నవలల్లో కొన్నింటిని ఆంధ్రభూమి మాస పత్రిక పాఠకులకోసం అందిస్తున్నాం. ఇది రెండవది.

"ఈమధ్య నీకు కార్యం అనుకున్నారు?"

"అబ్బ పోదూ... నీకెప్పుడూ అవే మాటలు!"

"అవును. నావి మాటలు, నీవి చేతలు"

"అదిగో మళ్లీ అదే మాట"

"ఏం? నీకంత కోపమెందుకమ్మా? ఈవేళగాకపోతే రేపయినా చేసుకొంటావుగానీ మానవుగదా?"

"ఏమిటా చేసుకునేది?"

"అదే కార్యం"

"ఛీ... పో రాజామణీ! ఏ మాట పట్టుకుంటే ఆ మాటే. వదలవు"

"వదుల్తే యెలా? అవునుగానీ ఈమధ్య అవుతుందనుకున్నారుగా? అవలేదా యేమిటి?"

"ఏమో నాకు తెలియదు. నన్నడక్కు"

"నీ కార్యం విషయం నిన్నడక్కపోతే దారిన పోయేవాళ్లనడగమన్నావా? అంత అసహ్యమయినదానివి, అసలెప్పుడూ చేసుకోకుండా ఉండు చూద్దాం"

"నువ్వు మాత్రం చేసుకోవా?"

"ఏదీ నాకింకా మొదలలేలేదయ్యో? నువ్వంటే రెడీగా ఉన్నావు"

"పెళ్లి కాలేదుగానీ అవుతే నువ్వూ రెడీగానే ఉందువు"

"నేనూ ఆ మాటే అన్నాను తప్పేముంది. కానీ ఇంతకీ నేనడిగిన దానికి మాత్రం సమాధానం చెప్పావుగావు ఎప్పుడూ?"

"అబ్బ పోవే... నాకు తెలీదు."

"కానియ్యి. ఆ రోజుకు నువ్వు పిలవకపోయినా వస్తాను. తలుపు సందుల్లోంచి తొంగి చూస్తాను" అని స్నేహితురాలు రాజామణి అనేటప్పటికి అమ్మన్న విరగబడి నవ్వడం మొదలుపెట్టింది.

"నువ్వెప్పుడూ ఇటువంటి కొంటె మాటలే అంటావు రాజూ!"

"నాలాంటి స్నేహితురాలు నీకు దొరకొద్దూ?"

"ఆ మాట నేనూ ఒప్పుకుంటాను"

"చిన్నప్పటినుంచీ ఒక చోటే వుంటూ ఒక స్కూల్లోనే చదువుకున్నాము కాబట్టి మన ఇద్దరకూ మనసూ మనసూ అతుక్కుపోయాయి. అందువల్ల నువ్వేమన్నా నాకు కోపం రాదు రాజామణీ!"

"సరేగానీ నేనడిగింది చెబుతావా చెప్పవా?"

"అదిగో మళ్లీ అదే మాట. నీకేమైనా మతిపోయిందా ఏమిటి రాజూ?"

"మతిపోవడంగాదమ్మడూ. నీకు కార్యమవుతే చూడాలని నాకు చాలా ముచ్చటగా వుంది. అందుకని ఇన్ని విధాల అడుగుతున్నానంతేగానీ నిన్ను ఉడికించాలని కాదు."

"నాకు తెలియదన్నప్పుడు ఊరుకోవాలా?"

"నీకు తెలియదంటే ఎవరు నమ్ముతారు? నా సెలవులు ఆఖరైపోయేలోపుగా అవుతే నేనిక్కడే ఉంటాను కాబట్టి తిరిగి కష్టపడి రానక్కర్లేదు. ఈమధ్య మీ ఆయన వచ్చాడట. అన్నీ మాటలాడుకున్నారట. ముహూర్తం కూడా నిశ్చయించుకున్నారట. మరి యెందుకవలేదూ"

"ఇక నువ్వా సంభాషణ యెత్తావంటే నేనిక్కడ ఉండేదిలేదు. ఇదిగో వెళ్లిపోతున్నా" అని అమ్మన్న కోపంతో లేచి వెళ్లిపోబోతూ ఉండగా రాజామణి స్నేహితురాలి చేయి పట్టుకుని తిరిగి కూర్చోబెట్టి-

"సరేనో... ఇక ఆ వూసెత్తనులే. కాస్సేపు కూర్చో. నీకు కార్యమవుతే నాకేమొచ్చె?"

అమ్మన్న తిరిగి పకపక నవ్వింది.

"ఊ... ఇంకేమయినా కబుర్లు చెప్పు మరి!"

"నువ్వే చెప్పాలి."

"నేను చెబితే పనికిరాదుగా?"

"పనికొస్తుంది. మీ కాకినాడ కబుర్లేమయినా చెప్పు"

"మీ రాజమండ్రం కబుర్లను నువ్వు చెప్పరాదూ?"

"నేనేం చెప్పను. నువ్వు కాలేజీలో చదువుకొంటున్న పిల్లవు. నీకే నాకంటే ఎక్కువ విషయాలు తెలుస్తాయి"

"నువ్వు మాత్రం చదువుకోలేదూ?"

"ఇప్పుడు చదువుకోవడం లేదుగా. నీ పనే బాగుంది. హాయిగా ఇంటి దగ్గర నుండి మీవాళ్లు పంపిన డబ్బును ఖర్చు పెట్టుకుని అక్కడ హాస్టల్‌లో వుండి చదువుకుంటున్నావు, నిర్విచారం."

"పాపం ప్రపంచంలో వుండే విచారాలన్నీ నీకే చుట్టుకున్నాయి కాబోలు ఏం?"

"నీ దారి నాకెలాగూ రాదుగానీ, ఈ గొడవకేంగానీ మీ హాస్టల్, కాలేజీ విశేషాలు చెప్పు"

"నువ్వూ రుచి మరిగావన్నమాట?"

"అదేం అలా అంటున్నావు?"

"హాస్టల్ విశేషాలు కావాలంటున్నావు. అక్కడ జరిగే రొమాన్సులు, లౌ మేకింగులు నీకూ వాసనగొట్టాయి కాబోలు."

"ప్రమాణ పూర్తిగా నాకేమీ తెలియదు. యధాలాపంగా అడిగానంతే"

"ఊ.. అయితే విను. సాధారణంగా మనలో పెళ్లయిన తరువాత చదువుకోవడానికి ఎవరూ ఒప్పుకోరుకదా?"

"అవునవును. అందువల్లనేగా నా చదువు థర్డు ఫారంతోనే అంతమయింది."

"థర్డు ఫారం ప్యాసయిన సంవత్సరమే నీకు పెళ్లయింది. అంతవరకూ మనమిద్దరమూ కలసి ఇక్కడే చదువుకున్నాము. అంతటితో చదువు మానిపించి నాక్కూడా పెళ్లి చేసేయమని మా అమ్మ చాలా దెబ్బలాడింది. కానీ మా నాన్నగారందుకొప్పుకోలేదు. కనీసం నాచేత స్కూలుఫైనలయినా చదివించాలనీ, అప్పుడే పెళ్లయితే ఆ చదువు సాగదనీ మా అమ్మతో దెబ్బలాడి పట్టుదలతో నా చదువునింతవరకూ సాగిస్తున్నారు."

"ఈ యేటితో స్కూలుఫయినల్ అయిపోతుందికదా, మానేస్తావా యేమిటి?"

"ఆ! అంతే. మా నాన్నగారప్పుడే సంబంధాల కోసం వెదుకుతున్నారు."

"సరేలే. మీ హాస్టలు గురించి ఏమిటో చెప్పబోయావు?"

"ఆ హాస్టల్ జీవితం కంటే ఖయిదు జీవితం మేలు"

"అదేం! ఆ జీవితం చాలా బాగుంటుందని నువ్వేగా చెప్పేదానవు."

"తెలియనిక్రితం అలా అనుకున్నాను. విను... ఆ కాలేజీలో చదువుకొంటూ ఆ హాస్టల్‌లో వుండేవారిలో పదహారేళ్లవాళ్లు మొదలుకొని పాతికేళ్ల యువతులవరకు ఉంటారు. కొందరు నాలాంటి వివాహంకాని కన్యలు, మరికొందరు వితంతువులు, భర్తలచే విడిచిపెట్టెయ్యబడినవాళ్లు కొందరు. మొత్తం మీద అక్కడున్న వాళ్లందరూ పురుష స్పర్శకు మొహం వాచిపోయి వున్న యౌవ్వనవతులే. ప్రపంచంలోని వాళ్లకందరికీ నిగ్రహముండడం కష్టం చూడు. అటువంటి ఆత్మనిగ్రహమున్న

వాళ్లూ పురుషుడు కనిపించినప్పటికీ ఆ వైపుకయినా చూడనివాళ్లూ, ఆ హాస్టలులో వున్న మూడువందలలోనూ ఏ ఇద్దరు ముగ్గురో కంటే ఎక్కువలేరు. ఆ ఇద్దరు ముగ్గురు మాత్రం ఏ యితర గొడవల్లోనూ కలుగ జేసుకోకుండా తమ చదువేదో, తమ లోకమేమో... అంతేగానీ ఉత్తప్పుడు ఆకాశం వయిపుకయినా తలయెత్తి చూసి ఎరుగరు.

ఇహ మిగిలినవాళ్లందరూ బందిఖానావంటి ఆ హాస్టల్ జీవితంలో విసిగిపోయి ఉంటారు. ఎక్కడయినా ఒక అందమైన పురుష ముఖం కనిపించింది అంటే ఆ మేడ మీద ఒకళ్లనొకళ్లు తోసుకుని ముందుకు వచ్చి విరగబడి చూడడం, కేరింతలు కొట్టడం... అంతలోనే ఆనందం, అంతలోనే మురిపెం.

హాస్టల్‌లో చేరిన కొత్తలో వాళ్ల వేషాలన్నీ నాకు చాలా అసహ్యంగా అనిపించేవి. రానురాను అలవాటుపడ్డాను. వాళ్లయొక్క పెరికిగొట్టుతనానికి తగినంత కారణం లేకపోలేదు. మా హాస్టల్‌లో కఠినురాలు వంటి సూపరిండెంటు ఒకావిడ ఉంది.

కాలేజీ నుంచి పిల్లలందరూ వచ్చేయగానే హాస్టల్ తలుపులు మూసేసేది, అలీఘర్ తాళాలు బిగించేది. ఏ ఒక్కరూ కూడా మేడ మీదనుంచి వాకిట్లోకి తొంగి చూడకూడదనేది. బజారుకు ఏ నోటుబుక్కు కోసమయినా వెళితే కూడా ఇద్దరు బంట్రోతులను పంపేది. ఏ పిల్ల తాలూకు అన్నగారో, తండ్రో, లేక ఏ దగ్గర బంధువో చూడడానికి వస్తే మూడురోజులదాకా పర్మిషనివ్వదు. ఆ ఇద్దరూ కష్టమూ సుఖమూ మాటలాడుకొంటూ వుంటే తాను పొంచి వుండి జాగ్రత్తగా వింటుంది. తోడబుట్టినవాడితోనయినాసరే అయిదు నిముషాలకంటే ఎక్కువకాలం మాటలాడనియ్యదు. అందరూ మంచి యవ్వనంలో వున్న పిల్లలు. ఆ వయస్సులో కేరింతలు కొట్టకుండా ఎవరుంటారు? ఏ భోజనాల దగ్గరయినా ఛలోక్తికి, వాళ్లల్లో వాళ్లేమయినా అనుకుని ఒక్కసారి నవ్వుకున్నారంటే దానికి పెద్ద రాద్ధాంతం చేసేది. కాలేజీ ప్రిన్సిపాల్‌కు రాసి వాళ్లను పదిహేనురోజులో, వారమో సస్పెండు చేయించేది.


పరిస్థితులు ఇలా ఉండగా నేను అక్కడకు చేరాను. జేరిన రెండు మాసాలకు మా అన్నయ్య నన్ను చూసి పోదామని వచ్చాడు. సూపరిండెంటుకు దరఖాస్తు చేసుకోవాలంటే అలా చేసాడు. వాడు లోపలకు రావడానికి పరిష్మనియ్యదే! నాకు ఒళ్లు మండుకొచ్చింది.

“ఇదేమిటమ్మా మా అన్నయ్య వస్తే మాట్లాడ్డానికి పర్మిషనియ్యవెందుచేత? వాడు నన్ను చూడడానికి మూడురోజులనగా వచ్చాడు. ఇంకెంతకాలం వుంటాడు?” అని నేను గట్టిగా అడిగినమీదట పర్మిషనిచ్చింది. వాడు నా గదిలోకొచ్చి కూర్చుంటే తాను పొంచి వుండి వినడం మొదలు పెట్టింది. కొంతసేపయిన తరువాత ‘అయిదు నిముషాలు దాటిపోయింది. ఇక మాటలాడడానికి వల్లకాదు’ అంది.

మా అన్నయ్య తెల్లబోయాడు. అప్పటికి నేను వాడితో ఇంకా యేమీ మాట్లాడలేదు. మా అమ్మ నాకోసం బెంగ పెట్టుకుందనీ, వచ్చే సెలవుల్లో తప్పకుండా ఇంటికొచ్చెయ్యవలసిందేనని, వాడింకా ఏమేమో చెబుతుండగానే ఆవిడగారొచ్చి మాట్లాడడానికి వీలులేదు అంది. దానితో నా ఒళ్లు మండిపోయింది.


“మా అన్నగారితో మాటలాడ్డానికి అయిదు నిముషాల టైమా? ఇది జయిలా, బందులదొడ్డా? నా ఇష్టమొచ్చినంతసేపు నేను మాట్లాడతాను. తరువాత నీ ఇష్టమొచ్చినట్లు చేసుకో” అని నేను గట్టిగా సమాధానం చెప్పడంతో వెనక్కు తగ్గింది. అనంతరం అరగంటసేపు మాట్లాడి మా అన్నయ్య వెళ్లిపోయాడు. ఈ సమాచారమంతా పిల్లలందరూ కనిపెడుతూనే వున్నారు.

‘రాజామణి బాగా చేసిందని’ నన్ను మెచ్చుకుంటున్నారు. నేనలా చేసినందుకు సూపరిండెంటు ప్రిన్సిపాల్‌కు రిపోర్టు చేసి నాకేమయినా శిక్ష విధిస్తుందేమోనని అనుకున్నాను. కానీ ఏమీ చేయలేదు. ఇందుకు పిల్లలందరూ చాలా ఆశ్చర్యపోయినారు. గట్టిగా దబాయించి మాట్లాడినవాళ్లనావిడ ఏమీ చేయలేదన్న రహస్యం క్రమంగా అందరికీ తెలిసిపోయింది.



## తెలుగుకే ప్రాధాన్యత!

‘భగీరథ’ తరువాత మరే తెలుగు చిత్రంలో నటించని శ్రియ బాలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకుని అక్కడ లాభం లేదనుకుందో ఏమో తిరిగి టాలీవుడ్‌కి చక్కా వచ్చేసి ‘డాన్ శ్రీను’తో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించింది. ఇక తాను రెగ్యులర్‌గా తెలుగు చిత్రాల్లో నటిస్తానని చెబుతోంది. ‘ప్రస్తుతం నేను రెండు తమిళ చిత్రాల్లో నటిస్తున్నాను. నేను ఏ భాషలో నటించినా నా ప్రాధాన్యత మాత్రం తెలుగు చిత్రాలకే’ అంటోంది శ్రియా. తెలుగు చిత్రాలపై శ్రియకున్న అభిమానాన్ని అభినందించాల్సిందే!



అప్పటినుంచీ ఎవరు పడితే వారే ఆమెను ఎదుర్కొనేవారు, చెవులు పట్టుకుని ఆడించేవారు.

ఇప్పుడింక హాస్టల్ సూపరిండెంటు అంటే ఎవరికీ భయంలేదు. శని, ఆదివారాలు ఇతర సెలవు దినాలు వచ్చినప్పుడు, తరువాత కాలేజీ లేని ఉదయం సాయంకాలాలయందు పిల్లలందరూ ఆ హాస్టల్ మేడమీద నానా గోలా చేస్తూ వుంటారు. ఒక పద్యాలేకాదు సినిమాలో డాన్సులే కాదు, అంతా అల్లరిమయం.

మా హాస్టల్ మేడకు ఎదురుగుండానే ఒక క్లబ్బువుంది. అక్కడికి సాయంకాలమయ్యేప్పటికి అనేక తరహాల యువకులు వస్తూ ఉంటారు. ఈ మేడమీది బాలికలు అటువైపు మెడలు పడిపోయేటట్లు చూస్తుం డడం, ఆ క్లబ్బుకు వచ్చిపోయే యువకులతో చూపులు కలుపుకోవ డమూ. ఆ హాస్టలు గుమ్మాలకెప్పుడూ తాళాలు, సీళ్లు లేకపోయినట్ల యితే ఇంకా ఏమి జరిగేదో? అని నేనొక్కొక్కప్పుడనుకుంటూ ఉంటాను.

"కాసేపు కూర్చో రాజూ, నువ్వొచ్చావుకనుక ఈ కాస్సేపైనా ఇలా కూర్చున్నానుగానీ లేకపోతే నా బ్రతుకెప్పుడూ విచారమే. నువ్వు సంతో షంగా కబుర్లు చెబుతున్నావు కాబట్టి ఈ కాస్సేపూ నా విచారాన్నంతటినీ మరచిపోయాను."

"ఎందుకమ్మా అంత విచారం? హాయిగా తిని కూర్చోలేకనా?"

"మా ఇంటి పరిస్థితులు నీకు తెలియవుగానీ రాజూ... ఇక్కడ వున్న నాలుగురోజులయినా అప్పుడప్పుడు కనిపిస్తూ ఉండవే. నిన్ను చూసి, నీతో కబుర్లు చెప్పినంతసేపు నేనీ ప్రపంచమునే మరచిపోయి ఆనం దాన్ని అనుభవిస్తాను"

"మన స్నేహం అటువంటిదమ్మడూ. వస్తా. చాలాసేపయింది" అని చెప్పి అప్పటికి రాజామణి, స్నేహితురాలిని విడిచి వెళ్లిపోయింది.

★★★

"ఆ పట్టుదల ఏమిటో నేనూ చూస్తాను. నాకూ చేతనవును"

"ఆడపిల్లనిచ్చుకున్నవాళ్లకు పట్టుదలలెలా సాగుతాయి చెప్పండి"

"ఓ... మహా చక్కా సాగుతాయి. ఎందుకు సాగవ్? కనీసం అయిదు వేలయినా ఇస్తేగానీ కార్యం చేసుకోనంటాడేం? అబ్బ... ఏం తెలివి? కార్యం చేసుకోకపోతే ఎవడికీ నష్టం? నాకూ లేక లేక పుట్టినదొక్క ఆడ పిల్ల. అతగాడు తీసుకెళ్లకపోయినంత మాత్రాన నాకు కలిగే వంచనయేమీ లేదు. ఆ పెంకితనమేమిటో నేనూ కనుక్కుంటాను" అని అమ్మన్న తండ్రి శ్రీపతి ఒక ఉత్తరము చేత్తో పట్టుకుని వంట ఇంట్లో భార్య గంగమ్మ ముందు క్రోధంతో చిందులు తొక్కుతున్నాడు. భార్య అతన్ని శాంతపర చాలని చూస్తూ వుంది. అప్పుడే అక్కడకొచ్చిన అమ్మన్నకు మొదట ఆ గొడవేమిటో అర్థమయిందికాదు.

తండ్రి చేతిలోని ఉత్తరమును తన భర్తే రాసి ఉంటాడని, డబ్బిస్తేగానీ అతను కార్యం చేసుకోననడం, తండ్రిగారు డబ్బియ్యననడము అంతా మామూలు గొడవేనని తెల్సుకొని యేమీ మాటలాడకుండా తల్లి దగ్గర కూర్చుంది.

"అతగాడికయినా ఇదేం బుద్ధమ్మా? ఈ అల్లుళ్లకు ఎంత పెట్టినా ఇహ తృప్తి అనేది ఉండనే ఉండదు కాబోలు. మూడు వేలు కట్నమూ అతనడు గుతేనే ఇచ్చామా? పై రెండువేల లాంఛనాలూ, అతడు కోరితేనే జరిపిం చామా? సరే... ఇప్పుడు తిరిగి చదువుకు డబ్బు కావలసినవాడు, చక్కగా దగ్గరకు రావాలి, మామగార్ని మంచిమాటలాడుకోవాలి. వారికి నచ్చచె ప్పాలి."

"ఓ... అలా అయితే అయిదువేలు కాదు, పదివేలు గుమ్మరిస్తానేమో ఎవరికి తెలుసు? అదీలేదు ఇదీలేదు. వెంటనే వచ్చి కార్యం చేసుకొని వెళ్ల వలసినదని సరసంగా ఉత్తరం రాస్తే అయిదువేలూ తన ఐసియస్ చదు వుకు ముందుగా గుమ్మరిస్తేగానీ కార్యం చేసుకొనేది లేదని ఉత్తరం రాస్తాడా తుంటరి. ఆ తుంటరితనమేమిటో నేకనుక్కోగలను. నాకు చేతన వును."

"అబ్బ పోనిస్తురూ"

"కార్యం చేసుకోమన్నప్పుడల్లా అబ్బాయిగారు నసిగెయ్యడానికిగల కారణం ఇదా? తనకు ఐసియస్‌కు లండన్ వెళ్లాలని ఉందని, అందుకు అయిన ఖర్చులో సగం తను పెట్టుకుంటాడని, మిగతా సగం నేనియ్యవల సిందని, ఇదివరకతనిక్కడకొచ్చినప్పుడు అమ్మడిచేత చెప్పించాడు. అప్పుడు నేను నీకేమని సమాధానం చెప్పానమ్మడూ చెప్పు" అని కూతుర్ని అడగ్గా-

"చేతనయిన సాయం తప్పకుండా చేద్దాం అన్నారు" ఆమె సమా ధానం చెప్పింది.

"అవునా? అటువంటప్పుడు ఇంతలోనే ఈ వెధవ ఉత్తరమేమిటి? కార్యం చేసుకోవడానికీ, ఆ వెధవ డబ్బుకీ సంబంధమేమిటి? తనకు నేను బాకీయా? కట్నం ఇస్తానని ఎగ్గొట్టానా? లోకంలోని అత్తారందరలాగునా నేను తనకు కట్నం తక్కువిచ్చానా? లాంఛనాలకు లోటు చేసానా? లేక ఇంకేమయినా దగా చేసానా? నాకిటువంటి తుంటరి ఉత్తరమును ఎందుకు రాస్తాడూ?"

"ఏదో పోనిస్తురూ కుర్రతనం"

"అయ్యో నీకు కుర్రతనమే. ఎందుకుగాదూ? బంగారపుబొమ్మ లాంటి పిల్లనిచ్చి లక్షణంగా పెళ్లిచేసి ముద్దు ముచ్చటలన్నీ తీర్చినందు కిదా ఫలం? మళ్లీ బిఎ ఆనర్సు చదివాడు. లండన్ చదువు కూడా వెలగ బెట్టబోతున్నాడు. ఇంకా చిన్నతనమంటావేమిటి? తుంటరితనమను"

"అయిపోయినదానిని గురించి పదే పదే తప్పుకోవడమెందుకు చెప్పండి? నలుగురూ వింటే బాగుండదు."

"ఏం చేయమంటావు?"

"మీరెలాగా కొంత డబ్బియ్యాలని అనుకున్నారు. ఇస్తానని చెప్పారు కూడాను. అతనింతగా పట్టుబడుతున్నాడు కాబట్టి అయిదు వేలూ అతని కిచ్చేద్దురూ. ఎందుకొచ్చిన అల్లరిది?"

"అయిదువేలు కాదుకదా, అయిదు పయిసలియ్యనిప్పుడు. ఆ డబ్బుకీ ఈ కార్యం చేసుకోవడానికి సంబంధమేమిటో కనుక్కుంటాను. నాకంత నిర్మొహమాటంగా ఉత్తరం రాస్తాడా? తను కోరిన అయిదువేలూ ఈయకపోతే కార్యం చేసుకోడేం? కానియ్యి!" అని శ్రీపతి రౌద్రమూర్తి అయి అల్లుడిమీద కారాలు మిరియాలు నూరుతున్నాడు. అతని భయం కర స్థితి చూసి అమ్మన్న కిక్కురుమనడంలేదు. భార్య గంగమ్మ ఎలాగైనా భర్తను ఒప్పించి వ్యవహారాన్ని సానాయించాలని చూస్తూ వుంది. కానీ ప్రయోజనం కనబడడంలేదు. ఆ అల్లుడు మావల పట్టుదల ఇంకా యెటువంటి భయంకర రూపాన్ని దాల్చి తనమీద పడుతుందా అని అమ్మడు ప్రాణాలనరచేతుల్లో పెట్టుకుని కూర్చుంది.

"భగవంతుడు మనకేదో ఇంత సమృద్ధిగా ఇచ్చాడు కదండీ. ఈ అయి దువేలతోనూ మన సంసారం తరిగిపోదు."

"అదేం మాట! ప్రపంచంలో ఉన్న గృహస్థు ఉంటాడు, లేని గృహస్థు

వుంటాడు. అల్లుళ్లు ఈ విధంగా డబ్బు కోసం భీష్మించుకుని, కార్యం చేసుకోనని, పిల్లను తీసుకెళ్లమని పట్టుబడితే గృహస్తులందరూ యేమైపోవాలి? లోకంలో అందరి అల్లుళ్లకూ బుద్ధి వచ్చేలాగున చేయాలి.''

"ఊరందరి గొడవా మనకెందుకు పోనిస్తురూ? మనం పిల్లనిచ్చుకున్నవాళ్లం. మీమీ పంతాల ఇరుకున పడి పిల్ల నిష్కారణంగా నలిగిపోతుంది. మనమా విషయం బాగా ఆలోచించాలి.''

"నేను బ్రతికి ఉన్నా లేకపోయినా అమ్మడికొచ్చిన లోటేమీలేదు. మనకు మొగ సంతానంలేదు. ఉన్నది యాభైవేల రూపాయల ఆస్తి అంతా దాని ఇష్టమొచ్చినట్లు స్వేచ్ఛగా అనుభవిస్తుంది.''

"అలాగునని, ఈడేరిన పిల్లను ఎంతకాలమని ఇంట్లో పెట్టుకుంటామండీ?''

"డబ్బియ్యకపోతే కార్యం చేసుకోనన్న అప్రాచ్యుడు అల్లుడిగా దొరికినందుకు ఎంత కాలమయినా అట్టే పెట్టుకుంటాము''

"లోకం హర్షిస్తుందా?''

"ఈ వెధవ లోకంతో నాకు నిమిత్తంలేదు. కార్యానికి ఐదు వేలు అపరాధం చెల్లించడానికి నా కూతురు కులం తక్కువదా? గోత్రం తక్కువదా? ఈ విధంగా అడగడానికి అతనికేం అధికారముంది? ఈసారి కార్యం చేసుకోవడానికి అయిదువేలు చెల్లగట్టమన్నాడు. రేపు పదివేలిస్తే గానీ పిల్లనేలుకోనంటాడు. ఆడపిల్లను కన్నందుకు ఆజన్మాంతమూ అల్లుడికి సామంతుణ్ణయి అతడు చెల్లగట్టమన్నప్పుడల్లా అపరాధం చెల్లగడుతూ ఉండవలసిందేనా?'' అని భర్త అంటూ వుంటే గంగమ్మ ఏమీ సమాధానం చెప్పలేకపోతోంది.

తండ్రి చెబుతూ వున్న మాటలలోని ప్రతి అక్షరం హేతువాదంగానే వుందని అమ్మడు తనలో అనుకుంది. వరండాలో అటూ ఇటూ పచార్లు చేస్తూ తిరిగి తీవ్రంగా అనుకుంది.

అతనే కంటిక్కనుపించి ఈ మాటను ఎదురుగా అన్నట్లయితే సమాధానాలన్నీ అతనినే చెప్పుదెబ్బ కొట్టినట్లడుగుతాను. తెలుసు నా పదును తెలుసు. అందుకనే ఎదురుగా నిలిచి అడగడానికి ధైర్యంలేక ఉత్తరం రాసాడు.

"ఇప్పుడింతకూ మీరనేదేమిటండీ?'' అని గంగమ్మ భర్తను అంతవరకూ జరిగినదానికి పర్యవసానం అడిగింది.

"అనేటందుకేముందీ? పిల్ల కార్యానికి అయిదువేలకూ ముడి అంటే అతనికి నావల్ల రాగిపైసా ముట్టదు. ఈ డబ్బు వూసెత్తకుండా సరసంగా వచ్చి కార్యం చేసుకోమను. ఆ తరువాత నా యాభైవేల ఆస్తిని దోచుకుపొమ్మను. నాకేం బాధ? అల్లుడు, కూతురికంటే నాకింకెవరున్నారు? ఎవరికి పెడతాను?''

"ఆ మాత్రం యింగితం అతనికి లేనప్పుడు మనమేంజేస్తామండీ?''

"ఇంగితం లేకపోతే వచ్చేటట్లు చేస్తాం. కార్యం చేసుకోనంటే బెదిరిపోతూ అయిదువేలూ గుమ్మరిస్తాననుకొన్నాడబ్బాయి. అటువంటి పౌరుషహీనమైన పని ఈ జన్మలో జరగదు.''

"పోనీ నా మాట విందురూ. అమ్మడి ముఖం చూసయినా అతనికి ఇచ్చేద్దురూ?''

"నువ్వు కాదుకదా బ్రహ్మదేవుడే వచ్చి సిఫార్సు చేసినప్పటికీ ఒప్పుకోను. చెప్పమను, అమ్మడ్ని మనస్ఫూర్తిగా చెప్పమను ఈ విధంగా కోరడం ధర్మమో, అధర్మమో. కార్యం చేసుకునే నిమిత్తం భర్త అయిదువేలు అపరాధం చెల్లించడం దానికేకాదు, దాని వంశానికపఖ్యాతి. దాని పెద్దల తల కొట్టినట్లు. కనుక ఇహనెప్పుడూ ఈ సిఫార్సు చెయ్యకండి'' అని ఖచ్చితంగా చెప్పి శ్రీపతి అల్లుడు రాసిన ఉత్తరాన్ని కోపంతో అక్కడే ముక్కలు ముక్కలుగా చించి పారేసి-

"ఇదిగో ఈ కార్యం చేసుకోవడానికి అయిదువేలు తెమ్మన్న ఈ ఉత్తరానికెంత గౌరవమో, దీనిని రాసినవారికి అంతే గౌరవం'' అని చించి పారేసిన కాగితం ముక్కలను కాలికింద తొక్కి అక్కడినుంచి వెళ్లిపోయినాడతను.

"చూసావా తల్లీ! మీ నాన్నగారి పట్టుదల. ఆది నుంచీ ఇంతే'' అని భర్త వెళ్లిపోయిన అనంతరం గంగమ్మ కూతురుతో అంది.

అమ్మడు ఒక నిట్టూర్పు విడిచి "నాన్నగారన్నదంతా సత్యమేనే అమ్మా. వారలా కోరడం తప్పు'' అని తల్లితో అంది.

"కాదని ఎవరూ అనడంలేదు. అతనటువంటి మూర్ఖపుపట్టు పట్టీ కూర్చున్నప్పుడు మనం కూడా అతనితో సమానంగా ఉంటే ఎలాగు. ముల్లు ఆకుమీద పడినా, ఆకు ముల్లు మీద పడినా నష్టం నీకేకదా? ఏ వ్యవహారమూ తెగేవరకూ లాక్కూడదు.''

"నిజమే... ఈ కార్యాన్ని గురించి అయిదువేలూ ఇచ్చుకుంటే ఒక అవమానంగానూ, అపఖ్యాతిగానూ తోస్తోంది నాన్నగారికి- గాని వారయినా డబ్బుకు లోభించి అలా అనడంలేదు.''

"ఇప్పుడింతకీ కర్తవ్యమేమిటో నాకేమీ బోధపడడంలేదు.''

"కర్తవ్యానికేముంది? నాన్నగారు చేసినట్లల్లా చూస్తూ ఊరుకోవడమే!''

"నాన్నగారు చేయదల్చుకున్నది తెలుస్తూనే వుందిగా? అంతే!''

"నువ్వు కూడా అలాగే అంటావేమిటి అమ్మడూ?''

"నామీద ఉండే మమకారంకొద్దీ అల్లుడు కోరిన అయిదువేలూ ఇవ్వమని సిఫార్సు చేస్తున్నావంతెగానమ్మ, ఆయన చేసిన పని ఎంతమాత్రం బాగుండలేదు.''

తండ్రిగారి ఉపన్యాసమయింది, ఇక కూతురుగారి ఉపన్యాసం కాబోలు!

"లేకపోతే ఏమిటమ్మా? నా ముఖమాయన చూడకుండా అయిదువేలిస్తేనేగాని కార్యం చేసుకోనని ఉత్తరం రాస్తారా? వారికి అయిదువేలు కావాలిగానీ నేనక్కర్లేదన్నమాట''

"ఓయబ్బో... నువ్వు మీ నాన్నకంటే నాలుగాకులు ఎక్కువే చదువుతున్నావు''

"నువ్వు కూడా ఆలోచించు. నాన్నగారు చెప్పినట్లు ఈవేళ అయిదు



వేలన్నారు, రేపు పదివేలంటారు. ఆ తరువాత మరొకటంటారు. అన్యోన్య ప్రేమపాశబద్ధం కావలసిన దాంపత్య జీవితాన్ని డబ్బుతోనూ, నగలతోనూ ముడిపెట్టజూస్తే అది యెంతకాలం నిలుస్తుందే అమ్మా! నాయం దెంతో ప్రేమ వున్నట్లు నటించేవారు, తమకు తగిన భార్యను నేనని ఎన్ని సార్లు చెప్పుకుని మురిశారు? ఇప్పుడా మాటలన్నీ ఏమైనాయి? అగోచరాలయినాయా? చదువుకొన్నదా పెద్ద చదువు, లోకజ్ఞానమూ తక్కువ కాదు, మంచిచెడ్డలు తెలియని తనమా? అదీగాక నాన్నగారు చెప్పినట్లు ఆ డబ్బు వూసెత్తకుండా వినయంగా వారు చెప్పినట్లు వినుకుంటే అల్లుని బాగు చేయవలసిన బాధ్యత మామగారి మాత్రం ఉండదూ? అప్పుడు వారయిదువేలే ఇస్తారో అంతకంటే ఎక్కువే ఇస్తారో ఆలోచించుకో వద్దూ?

తప్పు... డబ్బీయకపోతే కార్యం చేసుకోననడం చాలా తప్పు. ఇందుకు నేను కూడా హర్షించను. ఈ విషయంలో నేను నాన్నగారితో పూర్తిగా ఏకీభవిస్తున్నాను'' అని కూతురు యొక్క దృఢ నిశ్చయాన్ని కూడా వినిన గంగమ్మగారేమీ అనలేకపోయింది. అయినప్పటికీ కూతురు యొక్క కాపురము చెడిపోతుందేమోనని ఆమెకు దిగులు.

అందువల్ల ''సరేగానమ్మడూ! రేపు నువ్వే నీ మొగుడు పేర ఉత్తరం రాయి. ఏమనంటే ఇప్పుడు డబ్బు విషయం ఏమీ ఎత్తకుండా మామగారు కోరినట్లుగా వచ్చి లక్షణంగా కార్యం చేసుకోమను. ఆ తరువాత అయిదువేలిచ్చి లండను చదువుకు పంపే పూచీ నాదని వాళ్లకు రాయి.''

''నాకిష్టంలేదు. కానీ నువ్వు గట్టిగా చెబుతున్నావు కాబట్టి అలాగే రాస్తానులే. వారు ఒప్పుకోరు. నాకు తెలుసు. ఇందును గురించి ఆయనకూ, నాకు చాలా గొడవ జరిగింది.''

''ఆ గొడవకేంలేద్దూ. రేపు నా దగ్గర కూర్చుని నేను చెప్పినట్లు రాయి'' అని తల్లి నిర్బంధం చేసిన మీదట అమ్మడు ఆ విధంగా రాయడానికి అంగీకరించింది.

***

''రావే...రావే రాజూ... రావాలి... అతనొచ్చాడు'' అంటూ పదిమంది హాస్టల్ విద్యార్థినులు, లోపల యెక్కడో వున్న రాజామణిని హడావుడిగా పిలుచుకొచ్చారు. అందరూ ఆ మేడమీద వరండాలో వరుసగా నిలుచుని ఎదురుగా వున్న క్లబ్బులోకి వెడుతున్న ప్రసాద్‌ను చోద్యంగా చూస్తున్నారు.

అతడింక లోపలకు వెళ్లిపోయి వారికి కనిపించకుండా పోతాడనగా ముందుగా రాజామణి కిలకిలా నవ్వింది. దానితో మిగతా స్నేహితులందరూ కిలకిలా నవ్వారు. ప్రసాద్ ఇట్టే వెనుతిరిగి చూసేటప్పటికి మేడమీద జరుగుతున్న గలాభా ఇది.

అతడు తెల్లబోయాడు. వెంటనే ఇతర బాలికలందరూ లోపలకు వెళ్లి పోయారు.

రాజామణి ఒక్కతే మాత్రం అతనికి కనిపించేలా ఎదురుగా నిలుచుంది చిరునవ్వు ముఖంతో. ప్రసాద్ ఆమె ముఖంలోకి చూసాడు.

'నిజంగా ఆమె ఒక దేవకన్యలా వుంది. ఎంత పొగ్గా, ఎంత ఠీవిగా నిలుచుందో? ఎ రియల్లీ బ్యూటీ' అని తన అనుకుని ఇంకా ఆమె వయిపే వెర్రిగా చూస్తే దారినపోయే వాళ్లేమయినా అనుకుంటారని వెంటనే క్లబ్బు లోపలికి వెళ్లిపోయాడు.

తరువాత రాజామణి స్నేహితులందరూ కిలకిల్లాడుతూ ఇవతలికి వచ్చారు.

'చూపు చూపు కలిసిందా?' అని ఒకరు-

'అతను రోజూ క్లబ్బుకు రావడం నిన్ను చూడ్డానికే' అని ఇంకొకరు-

'మొన్న నువ్వు చూడలేదుగానీ రాజూ! నువ్వు స్కూలు నుంచి వస్తూ ఉన్నప్పుడు నీవయిపు వెర్రిగా ఎంతసేపు చూసాడో నీకు తెలీదు' అని వేరొకరు-

'మీ ఇద్దరిదీ మంచి ఈడూజోడూ, మెల్లగా స్నేహం కలుపు' అని మరొకరు-

ఈ విధంగా రాజామణిని అందరూ తలోరకంగా అనడం, నవ్వడం మొదలు పెట్టారు.

''అబ్బ... పొండర్రా నాతో మాటలాడకండి'' అని రాజామణి లేని చిరాకును తెచ్చుకుని అనగా-

''అవును ఇంకెందుకూ 'ఓడ దాటేవరకూ ఓడ మల్లయ్య ఓడ దాటాక బోడి మల్లయ్య... అబ్బాయిగార్ని చూపించాముగా.. ఇక మాతో ఎందుకు మాటలాడతావమ్మా?'' అని ఒక కొంటెపిల్ల హేళన చేసింది.

''దానికేంగానీ చాలా అందమైన యువకుడర్రా!'' అని రాజామణి అంది.

''ఊహూ... మనం వేళాకోళానికంటూ వుంటే ఈమె నిజంగానే అతని మీద కన్నేసిందర్రోయ్. చదువుకునే పిల్లకి ఇవేం పనులు?'' అని తిరిగి మరియొక బాలిక అంటే అందరూ పకపకా నవ్వారు.

''నీకు తెలియకుండా అతను నీకోసం ఎంతకాలం ప్రయత్నం చేస్తున్నాడో పాపం!'' అని ఇంకొక యువతి ఈ విధంగా అందరూ తలోవయిపునా హేళన చేస్తుండేటప్పటికి రాజామణికి నిజంగానే కోపమొచ్చిందీ సారీ.

''చాలుగానీ ఇహ కట్టిపెట్టి లోపలకు నడవండి. అమ్మగారొస్తున్నారు. ఇప్పుడందరీ పనీ అవుతుంది'' అని రాజామణి అంది.

అమ్మగారు రావడం నిజమే. వెంటనే ఎవరి గదుల్లోకి వాళ్లు వెళ్లిపోయి ఏమీ ఎరగనట్లు చదువుకోవడం మొదలుపెట్టారు.

అనంతరం రాజామణి తిరిగి బయట వరండాలోకొచ్చింది. అతను కనిపిస్తాడేమోనని క్లబ్బువయిపు చూసింది. క్లబ్బుకొచ్చినవారిలో కొందరు అప్పటికప్పుడే తిరిగి వెళ్లిపోతున్నారు.

'అయ్యో అతను కూడా వెళ్లిపోయాడేమో. తిరిగి చూద్దామనుకున్నాను' అని తనలో విషాదంగా అనుకొంటుండేలోపల ప్రసాద్ టెన్నిస్ బ్యాట్ పట్టుకుని ఇతవలికి వచ్చి మేడవయిపు తలెత్తి చూసాడు.

ఆమె కనిపించింది.

అతడు వెళ్లిపోకుండా అక్కడే నిలుచున్నాడు. ఇద్దరి చూపులూ కలసి పోయాయి.

ఆమె సౌందర్యమునతడు, అతని సొగసునామె తమలో తామే మెచ్చుకున్నారు. ఆ ప్రథమ వీక్షణంలో ఆ ఇద్దరి చూపులూ ఏకమై యేమేమోటలాడుతున్నాయి.

ఇంతలో లోపల చదువుకుంటున్న పిల్లలందరూ ఒక్కసారిగా ఇవతలకు వచ్చేయడంవల్ల అతను తలను కిందకు దించేసుకుని వెళ్లిపోయాడు.

'అమ్మదొంగా! నువ్విక్కడ చేస్తున్న పని ఇదా?'' అని స్నేహితులు పెద్ద గోల చేయడం మొదలపెట్టారు.

దానితో రాజామణి ''కోతిమూక.. అబ్బా ఏమిటాగోల?'' అంటూ తాను కూడా లోపలకు వెళ్లిపోయింది.

కొంత దూరం నడిచిన అనంతరం తిరిగి ఆమె కనిపిస్తుందేమోనని ప్రసాద్ వెనుదిరిగి ఆ మేడవయిపు చూసాడు.

కానీ ఆమె కనిపించలేదు. అతడొక నిట్టూర్పు విడిచి తిన్నగా ఇంటికెళ్లిపోయాడు. కానీ ఆనాడు అతని దృష్టంతా రాజామణి మీదనే నిలబడిపోయింది.

'ఇంతకాలం ప్రయత్నం చేయగా చేయగా ఈనాటికి నా కోరిక నెరవేరింది. ఆమెను తన కళ్లతో ప్రేమను గుమ్మరించి నా జన్మను తరింపజేసింది. ఏమీ సందేహంలేదు. ఆమెకు కూడా నాపై మనసు వుంది. ఇంకా కొంచెంసేపు నిలుచుండి చూద్దామనుకున్నానుగానీ ఆ కొంటె బాలికలందరూ వచ్చి మా ప్రేమసయ్యాటలకు ఆటంకం కలిగించారు. కానియ్యి.. అప్పుడే ఏమయింది? క్రమంగా మా ప్రేమ వృద్ధవుతుంది. కానీ ఎలాగ? ఆమెతో మాటలాడడానికి వీలెక్కడ? ఇనుపపంజరంలాంటి ఆ హాస్టల్‌లో వున్న ఆమెను కలుసుకోవడానికి వీలెక్కడ? అలాగునని నిరాశ చేసుకోవడమేనా? అబ్బే... ఎప్పటికయినా సాధించి తీరాలి. ఖయిదాలోవున్న హాస్టల్ స్టూడెంట్, అతి జాగ్రత్తగా ఉండలేకపోయినట్లయితే అల్లరవుతుంది. క్లబ్బుకొచ్చే పెద్ద పెద్దవాళ్లందరకూ తెలిసిపోయిందంటే ఇక తలెత్తుకుని తిరగలేను.

అయితే నా మనసులో వున్నదాన్ని ఆమెకు తెలియజేయడం ఎలాగు? ఒక చీటీ రాసి ఎవరూ చూడకుండా మేడమీదకి విసురుతే. అబ్బే! అక్కడందరూ కోతుల్లాంటి విద్యార్థినులున్నారు. ఎవరయినా కనిపెట్టారంటే కొంప మునుగుతుంది.

లేకపోతే ఒక పని చేయాలి. ఆ హాస్టల్ నౌఖరెవరో తెలుసుకుని వాడి చేతిలో ఒక రూపాయి డబ్బులు పెట్టి ఈ ఉత్తరాన్ని ఫలానావాళ్లకియ్యమని చెబితే!

ఆమె పేరే తెలియదుగదా. ఎవరికియ్యమని చెప్పడం? ఒకవేళ నౌఖరు ఒకరికియ్యవలసిన ఉత్తరాన్ని ఇంకొకరికిచ్చాడంటే మొదటికే మోసమొస్తుంది.

రోజూ సాయంకాలం క్లబ్బుకు వెడుతూ వుంటే ఆమె కనిపిస్తూ ఉంటుందిగా! చూస్తూ ఉంటాను. క్రమంగా ఆమే ముందుకు వస్తుంది అని అతడు తనలో తాను ఆలోచించుకుంటూ వుండగా ఇంతలో అక్కడికతని స్నేహితుడు మూర్తి వచ్చి-

"ఏమోయ్! ప్రసాద్! తీరుబడిగా కూర్చున్నావేం?" అన్నాడు.

"ఏమీ లేదోయ్! రా.. ఇప్పుడే వచ్చాను క్లబ్బునుంచి."

"ఏమిటి క్లబ్బు విశేషాలు?"

"ఏమున్నాయి! ఈవేళ నువ్వు క్లబ్బుకు రాలేదేం!"

"వేరే పని వుండడంవల్ల రాలేదుగానీ మన క్లబ్బుకు ఎదురుగుండా ఉండే ఆడవాళ్ల హాస్టల్ చాలా న్యూసెన్స్‌గా ఉందోయ్"

"అలా అంటున్నావేం?"

"నీకు మాత్రం తెలియదా ఏమిటి? క్లబ్బుకువచ్చే మగవాణ్ణీ ఆ పిల్లలు ఆ మేడమీద నిలుచుని పంజరంలోని చిలకల్లాగా చూస్తూ కేరింతలు కొడుతూ ఉంటారు."

"అందువల్ల పోయిందేముందిలెస్తూ"

"ఏమీలేదు. అనవసరమైన అల్లరిగా ఉంటుంది."

"అందువల్ల నష్టమెవరికీ లేదుగా?"

"అవునులే... నష్టమెవరికీ లేదు. రాత్రింబవళ్లు ప్రపంచమంటే ఏమిటో తెలియకుండా ఖయిదులాంటి ఆ హాస్టల్‌లో బంధింపబడి ఉండడంవల్ల కాస్త కంటికింపయిన యువకుడెవరయినా కనుపిస్తే విరగబడి చూస్తారు."

"అంతేనా? ఇంకేమయినా ఉందా?"


"అంతేనా! ఇంకేముంటుంది? ఆ హాస్టల్ సూపరిండెంట్ చండశాసనురాలు. ఆ పిల్లల్ని వెయ్యి కళ్లతో ఖాయిదా చేస్తూ వుంటుంది. ఎప్పుడూ ఆ గేట్లకు తాళాలు, సీళ్లూ ఉంటాయి. చూడడంలేదూ?"

"అవునవును."



## టాలెంట్ ఆమె సొంతం!

టాలీవుడ్‌లో ప్రస్తుతం అనూష్క హవా సాగుతోంది. అటు గ్లామర్ తారగానే కాదు, ఇటు పెర్మామెన్స్ వున్న తారగా కూడా అందరి అభిమానాన్ని చూరగొంటోంది. అంతేకాదు, 'యముడు' తమిళ చిత్రంతో అక్కడి ప్రేక్షకులను సైతం తనవైపుకు తిప్పుకుంది. అటు సాంప్రదాయసిద్ధమైన 'జేజెమ్మ' పాత్రలో నటించినా, ఇటు బిల్లాలో బికినీలో కనిపించినా ప్రేక్షకులను మెప్పించడం ఆమెకే చెల్లింది. ఇంత టాలెంట్ ఉంది కనుకనే నిర్మాతలు ఆమె కాల్షీట్ల కోసం పోటీ పడుతున్నారు. ఏది ఏమైనా అనూష్క రూటే సపరేటు!



"అటువంటప్పుడింకేం చేయడానికి వీలవుతుంది?''

"అటువంటి నిర్బంధ జీవితం గడపడం చాలా కష్టం సుమీ''

"అమ్మో... అలా లేకపోయినట్లయితే ఈపాటికందరూ తలో యువకుడ్ని తీసుకుని లేచిపోదురు.''

"పోదూ! నీదంతా విడ్డూరమే. పాపం నిజంగా వాళ్లను చూస్తే నాకు చాలా జాలవుతుంది.''

"ఓహో ఈవేళ తమరు ఇలా మాటలాతున్నారేం. ఎప్పుడూ వెధవ హాస్టల్, వెధవ గోల అని తిడుతూ ఉండేవాడవుగా. ఆహా ఇప్పుడేంటి ఇంత అభిమానమొచ్చింది చెప్మా?''

"అబ్బే అభిమానమేమీలేదు'' అని ప్రసాద్ ఒక చిరునవ్వు నవ్వేసి ఊరుకున్నాడు.

"ఆ.. యేదో వుంది కథ. నవ్వుతున్నావు కూడాను.''

"అబ్బే ఏమీ లేదోయ్ అయినా ఏముంటుంది?''

"ఏముంటుందీ? ఆ పంజరంలోని ఏ చిలకయినా నీ వలలో పడి వుంటుంది. అంతకంటే ఇంకేమీ ఉండదు. అందుకనే కాబోలు ఎంత పని వున్నా క్లబ్బుకు మానకుండా మహా రెగ్యులర్‌గా వెళతావు.''

"నీ అనుమానాలు, అంచనాలు చాలా బాగున్నాయి.''

"భగవంతుని సాక్షిగా చెప్పు ఏమీ లేదూ?''

"ఒట్టెందుకు?''

"ఆ...తెలిపోయింది.''

"నీ దగ్గర దాచడమెందుగ్గానీ అందులో ఒక పిల్ల నావయిపు పదిసార్లు చూస్తుంది. నాకూ ఆ విషయం ఈవేళే తెలిసింది. ఇంతకుముందు తెలీదు.''

"ఆమె ఎలా వుంటుంది?''

"పద్దెనిమిదేళ్లుంటాయి. పచ్చగా వుంటుంది. చెవులకు రింగులు, నొక్కునొక్కుల జుత్తు... అంతా ఓ సినిమా స్టార్ ఫక్కీలో వుంటుంది.''

"కళ్లజోడు, చేతికి రిస్టువాచీ వుంటాయికదూ?''

"అవునవును.''

"కొంపతీసావోయ్''

"అదేం... ఆమెను నువ్వెరుగుదువా?''

"అవును. ఆమె తల్లిదండ్రులు నాకు చాలా దగ్గర. వాళ్లది విశాఖ పట్నం. ఆ అమ్మాయి పేరు రాజామణి.''

"అవునోయ్... స్నేహితులు రాజూ అని పిలవడం కూడా విన్నాను.''

"ఆమెకింకా పెళ్లి కాలేదు. ఈ సంవత్సరం స్కూలు ఫయినలు అయిపోతే పెళ్లి చేద్దామనుకుంటున్నారు.''

"మనవాళ్లేనన్నమాట''

"మాకు చాలా దగ్గరేననడంలేదూ?''

"అయితే ఆమె గుణం ఎటువంటిది?''

"చాలా మంచిది. ఎన్నడూ ఎటువంటి అల్లరిచిల్లర వేషాలు వేసి ఎరుగదు. మరి నిన్ను చూడగానే మనసు చలించిందేమో ఎవరు చెప్పగలరు?''

"నా దగ్గరయినా అటువంటి అల్లరిచిల్లర వేషాలెన్నడూ వెయ్యలేదు సుమా. ఈ వేళ మాత్రమే కొంచెం అనుమానం తట్టింది. ఇంకా ఏమీ నిర్ధారణగా చెప్పలేను.''

"చూడూ... మీ ఇద్దరూ సై అనుకున్నారంటే నిముషంలో మేరేజ్ సెటిల్ చేయగలను.''

"అంతవరకూ వచ్చినప్పుడు చూద్దాంలే'' అని అతనప్పటికి అనేసాడుగానీ ముఖలక్షణాలదో మాదిరిగా మారిపోయాయెందుకో అతని ఆలోచనను సూచిస్తూ ఉండడంవల్ల.

"ఏమిటీ అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?'' అని మూర్తి అడిగాడు.

"అబ్బే ఏమీలేదు. అలా ఎక్కడికయినా షికారుకు పోదాం వస్తావా?''

"ఓ... అన్నట్టు ఇప్పుడు నేనిక్కడకు వచ్చిన పనే మర్చిపోయాను. సినిమాకు పోదాం వస్తావా?''

"వెధవ సినిమా పోనిస్తూ.''

"అలా అనకోయ్ పుల్లయ్యా.. హాస్టల్ గేంగంతా బయలుదేరిందీవాళ సినిమాకు. అందులో నీ రాజామణి కూడా వుంది. నేను చూసాను. త్వరగా బయలుదేరు... ఊ'' అని అతను హెచ్చరించడంవల్ల ప్రసాద్ బయలుదేరుతూ-

"నిజంగా వాళ్లొస్తున్నారా? తమాషాగ నన్నేడిపించడానికి అంటున్నావా?'' అని ప్రసాద్ తిరిగి అడగ్గా-

"ఛా...యదార్థమే బ్రదర్. నేను చూసానిప్పుడే'' అని మూర్తి తిరిగి అనడంవల్ల ఆ ఇద్దరూ సినిమాకు బయలుదేరారు.

***

"ఏమండీ! అల్లుడిగారి నుంచి ఉత్తరమొచ్చింది. చూసారా?'' అంటూ గంగమ్మగారు భర్తకొక ఉత్తరమును తీసుకొచ్చి ఇచ్చింది. అతడు దాన్ని సాంతం చదివి పళ్లు పటపట కొరుకుతూ-

"అసలు ఆ ఛండాలుడికి మళ్లీ ఉత్తరం రాయమని ఎవరు చెప్పారు?'' అని భార్యమీద లేచాడు.

"ఏమయినా లాభముంటుందేమోనని అమ్మడితో చెప్పి నేనే రాయించాను.''

"మహా గొప్ప పని చేసావు. ఏమని సమాధానం రాసాడో చూసావా?''

"అమ్మడే కొంతవరకు చదివి చెప్పింది. మీరు పూర్తిగా చదివి చెబుతారేమోనని తీసుకొచ్చాను.''

"చెప్పడానికేమీలేదు. పాడిందే పాట. తను కోరిన ప్రకారంగా ఐదు వేలూ ఇచ్చిననాడే కార్యం చేసుకుంటాడట. ఈ విషయం మళ్లీ మళ్లీ అడిగి తన్ను విసిగించవద్దంటున్నాడు. ఆ అబ్బాయికి ఎంత పొగరుగా వుందో చూడు. అయిపోయిందేదో అయిపోయిందిగానీ ఆ నీచుడి మాట నా ఇంట్లో ఇక ఎన్నడూ ఎవరూ తలపెట్టడానికి వీల్లేదు. వెళ్లు'' అని భర్త అరిచి ఆ ఉత్తరమును ఆమె మీదకు విసిరికొట్టడంతో గంగమ్మ ఇహ అక్కడ నిల్చోకుండా అక్కడినుంచి కూతురున్న గదిలోకి వెళ్లిపోయింది. అమ్మడు అక్కడొక మంచంమీద పడుకుని వెక్కి వెక్కి ఏడుస్తుండడం చూసి గంగమ్మగారు మరింత దిగులుపడింది.

"ఎందుకు తల్లీ! ఎన్నడూ లేనిది ఈనాడీ విధంగా ఏడుస్తున్నావెందుకు?'' అమ్మడు మాటలాడలేదు.

"అతనీ విధంగా ఉత్తరం రాసాడనేనా? నాతో చెప్పవూ'' అని తల్లి అనేక విధాలుగా బుజ్జగించిన అనంతరం-

"అమ్మా! నాలాంటివాళ్లసలీ ప్రపంచంలో బ్రతకకూడదే. నావల్ల ఏమీ అపరాధం వచ్చిందని వారీ విధంగా నన్ను విడిచిపెట్టేసారు. తాము కోరిన పైకమీయకపోతే ఇక ఈ జన్మలో నా ముఖం చూడనని ఎంత కఠినంగా రాసారో చూడు.''

"నన్నేం చేయమంటావే తల్లీ. నాన్నగారికే కాకుండా నీకు కూడా అతను కోరిన డబ్బు ఇవ్వడానికి సమ్మతిలేదు."

"అయిదువేలు ఈయకపోతే నన్నేలనే భర్తతో కాపురం చేయాలా? నేనేం తప్పు చేసానని అయిదువేలు అపరాధం చెల్లించాలి?"

"మీ నాయనకూ, నీకూ కూ ఈ పట్టుదలే పట్టుకుంది. పోనీ అతడు భీష్మించుక్కూర్చున్నాడుకదా. ఆ డబ్బేదో పారేద్దామన్న ఆలోచన లేదు. అతను పట్టు పట్టుక్కూర్చున్నాడుగదా. మనం కూడా అలాగే పట్టుబట్టి కూర్చుంటానంటే ఎలాగ?" అని ఇద్దరూ వాదులాడుకుంటూ ఉన్న సమయంలో బయటనుంచి-

"ఏమండోయ్ గంగమ్మగారూ! అమ్మడూ" అని ఎవరో కేక వేయడం వల్ల గంగమ్మ ఇవతలికి తొంగి చూసి తిరిగి కూతురున్న గదిలోకి వెళ్లి-

"అమ్మడూ! లే, లేచి కళ్లూ ముఖమూ తుడుచుకుని ఇవతలకురా. ఎవరో పెళ్లివారుకాబోలు పిలుపుకొచ్చారు" అని చెప్పింది.

వెంటనే అమ్మడు కూడా హడావుడిగా కళ్లు తుడుచుకుని ఇవతలకు వచ్చింది. తన విచారరేఖలను బయటకు కనిపించనీయకుండా ప్రయత్నం చేస్తూ వారందరూ కూర్చున్న చాపమీదనే తానుకూడా కూర్చుంది.

"ఎవరో కొత్తవాళ్లు పిలవడానికి వచ్చారనుకున్నాను. మీరేనా రమణమ్మగారూ" అని గంగమ్మ తానెరిగివున్న యువతిని పరామర్శించిన అనంతరం-

"ముస్తాబై పిలుపులకు బయలుదేరారు. ఏమిటి కథ?" అని తిరిగి అడిగింది.

అప్పుడు రమణమ్మగారు గంగమ్మగారికి బొట్టుపెడుతూ "మా పెద్దమ్మాయి పెద్దమనిషి అయింది. రేపు పంక్తి. మీరందరూ భోజనానికీ, పసుపు కుంకానికి రావాలి" అని అనంతరం అమ్మడికి కూడా కుంకం బొట్టు పెట్టి-

"మీ అమ్మణ్ణి ఇహ అత్తవారింటికి పంపరా ఏమిటి గంగమ్మగారూ!' అని అడిగేటప్పటికి అమ్మడు ముఖం చిన్నబుచ్చుకుంది.

గంగమ్మ ఒక వేడి నిట్టూర్పును విడిచి-

"ఇంకా కార్యం కాలేదుగా అమ్మా. అయిన వెంటనే పంపుతాము" అంది."

చుట్టూ వున్న పేరంటాళ్లందరూ అమ్మడివయిపు సోద్యంగా చూసి వెళ్లిపోయారు.

***

అటూ ఇటూ తెరలు కట్టబడిన జట్కా బండి ఒకటి వచ్చి ఆనాడు పది గంటలవేళ తన ఇంటి ముందు ఆగడం చూసి ప్రసాద్ తెల్లబోయాడు. తనకోసం స్త్రీలెవరు వస్తారబ్బా అని ఆశ్చర్యపోయాడు. ఎంత ఆలోచించినా అతనికేమీ అర్థం కాలేదు,.

ఇంతలో మబ్బుల్లోని మెరుపులాగ చేతిలో పుస్తకాలు, రాజామణి బండిలోనుంచి ఉరకడమేమిటి, ప్రసాద్ గదిలోకి పరుగెత్తుకు రావడమేమిటి, రెండు పనులూ ఒకేసారి జరిగాయి. ఆమెను చూడగానే ప్రసాద్‌కు ఆనందం, ఆశ్చర్యం, భయం... ఇంకా ఎన్నెన్నో ఉద్రేక భావాలు కలగడం మొదలుపెట్టాయి.

బండివాడికంతకు ముందే కిరాయి డబ్బులు ముట్టడంవల్ల వాడు తిరిగి జట్కాను తోలుకుని వెళ్లిపోయాడు. ప్రసాద్ తెల్లబోయి ఆమె ముఖంలోకి చూసాడు.

"నా రాక మీకమితమయిన ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది అవునా?" అని రాజామణి చిరునవ్వు ముఖంతో అడిగింది.

"ఈవేళ స్కూలులేదా?"

"వుంది."

"మరి ఎలా రాగలిగావు?"

"మీ ఉత్తరమే నాకింతటి ధైర్యాన్ని కలిగించి ఇప్పుడిక్కడకు రప్పించింది."

"ఏమని రాసాను?"

"జ్ఞాపకం లేదూ?"

"దానికేంకానీ మా నాన్నగారికి ఉత్తరం రాసాను మనం పెళ్లి చేసుకుంటామని, అంగీకారం తెలియపర్చవలసిందని" చెప్పి వెళ్లిపోయింది.

'ఆయన వచ్చి నాతో ఏమి మాటలాడనున్నాడో, ఆయన అడిగే ప్రశ్నలకన్నింటికీ నేను సరైన ప్రశ్నలను చెప్పగలనో లేక తడబడతానో. ఏది ఏమైనా రాజామణి వంటి భార్య నాకు సప్తజన్మలెత్తినా దొరకదు. విద్యావతి, సౌందర్యవతి. ఈ అవకాశమును ఏమాత్రం జారవిడువకూడదు. భగవంతుడేం చేయదల్చుకున్నాడో!' అని ఆనాడంతా అతను తనలో తానే ఆలోచించుకోవడంలో గడిపేసాడు.

***

అతనా మర్నాటి సాయంకాలం క్లబ్బుకు వెళ్లడానికని క్రాపు దువ్వుకుని సూటు వేసుకుని, బూటు తొడుక్కుని ఇవతలకు వస్తూ ఉండగా ఒక కొత్త మనిషెవరో ఆ గుమ్మంలో నుంచుని-

"ప్రసాద్‌గారిల్లెక్కడండీ?" అని అడిగాడు.

ప్రసాద్ కొంచెం ఆశ్చర్యంతో "ఏ ప్రసాద్ సార్?" అని అడిగాడు.


"కె.ప్రసాద్, ఎంఏ"

"దయచేయండి"

"మీరేనా?" ఆయన అడగ్గా ప్రసాద్ అవునన్నట్లు ఒక చిరునవ్వు నవ్వి అతడు రాజామణి తండ్రి అయి ఉంటాడని మనసులో అనుకుని మర్యాద చేసి లోపలకు తీసుకువెళ్లి కూర్చోబెట్టాడు. ఫ్లాస్కులో ఇంకా మిగిలిపోయివున్న కొంచెం టీనీ అతనికిచ్చిన అనంతరం-

"తమ నివాసమండీ"

"విశాఖపట్నం. ఇక్కడ మా అమ్మాయి చదువుకుంటోంది" అని చెబుతూ ఆ నూతన వ్యక్తి ప్రసాద్ వయిపూ పట్టిపట్టి చూస్తున్నాడు. అనంతరం ఆ గది నాలుగువైపులు పరికించి చూస్తున్నాడు. కాబోయే అల్లుని యొక్క స్థితిగతులను తెలుసుకోవడం మామగారి విధి కదా. తానుకు



న్నట్లు ఆయన రాజామణి తండ్రే అయినందున ప్రసాద్ తనలోతాను సంతోషించాడు.

కానీ అప్పుడతని గుండె ఎందుకో భయంతో వేగంగా కొట్టుకోవడం మొదలుపెట్టాయి.

"ఈ మేడ మీ స్వంతమా?"

"అవునండీ"

"మా రాజామణి మిమ్మల్ని గురించి రాసిందండి. ఆమె రాసినదానికి నేను చూసినదానికి ఏమీ తేడా లేకపోవడం చాలా సంతోషం."

ప్రసాద్ గర్వంగా ఒక నవ్వు నవ్వాడు.

"తల్లిదండ్రులు లేరని విన్నాను"

"అవునండీ"

"మీరు కాలేజీ విడిచి ఎంతకాలమయింది?"

"నిరుడేనండీ. ఆనర్సు పాసయినాను."

"ఓహో... అయితే తరువాతేం చేయదల్చుకున్నారు?"

"ఇంకా ఏమీ నిర్ధారణ చేయలేదు. ఏదయినా ఫారిన్ డిగ్రీ సంపాదించాలని వుంది"

"అందరును వెడతారా?"

"సాగుతేను"

"ఆ సాగడానికేముంది?"

"అదేలెండి"

"తోబుట్టువులు ఎవరైనా ఉన్నారా?"

"ఎవరూ లేరండి"

"మా రాజామణి మిమ్మల్నెప్పుడయినా కలుసుకుని మాటలాడిందా?"

"ఒక్కసారి మాత్రం."

"ఆమె గురించి నేను మీకు విశేషంగా చెప్పనవసరంలేదనుకుంటాను. మీలాంటివారికటువంటి విద్యావతి భార్యగా ఉన్నట్లయితే అనుకూల దాంపత్యమవుతుంది."

ప్రసాద్ ఏమీ మాట్లాడలేదు.

"ఆమె విద్యావతి అయినందుకు, తనకు తానే అనుకూలుడయిన భర్తను నిర్ణయించుకోగలిగినందుకు చాలా సంతోషం. మీ ఇద్దరి మధ్య అన్యోన్య ప్రేమ కుదరడం మరియొక అదృష్టం."

ప్రసాద్ అతను చెప్పేదానిని వినడమే తప్ప ఏమీ సమాధానం చెప్పడంలేదు.

"అంతా రెండు సంవత్సరాలనుంచి అమ్మాయికి తగిన వరుడిని వెదుకుతున్నాం. ఒకరికి ముక్కు వంకరని, మరియొకరికి మూతి వంకరని, ఇంకొకరికి చదువు తక్కువని... ఇలాగ వంకలు పెడుతూ వచ్చింది. ఈ విధంగా ఆమెకు నచ్చకపోవడమూ, మాకు నచ్చకపోవడమూ జరుగుతూ ఉండడంవల్ల ఆ కోరిక నెరవేరలేదు. ఈనాటికి అమ్మాయికి మాకూ కూడా నచ్చిన సంబంధం దొరికినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది" అని కాబోయే మామగారు ఉత్సాహంగా చెబుతూ ఉంటే ప్రసాద్ ఎందుకో పరధ్యానంగా వింటున్నాడు. ఆ విషయం గమనించిన యెదట మనిషి-

"మీరు బయటకు వెడుతూ వున్న సమయంలో నేను రావడంవల్ల మీ పనికేమయినా అంతరాయం కలిగిందనుకుంటాను" అన్నాడు.

"అబ్బెబ్బె... ఏమీ లేదండీ. అంతరాయమేమీలేదు. మామూలుగా క్లబ్బుకు వెళ్లే ప్రయాణమే తప్ప విశేషమేమీలేదు."

"ఆహా... తరువాత మీ మనసులో వున్నదానిని మీరు చెప్పడమూ, నా మనసులో వున్నదానిని నేను చెప్పడమూ విధాయకము. ఇటువంటి వాటిల్లో మొగమాటాలు పెట్టుకున్నట్లయితే ఆనక మాట పడవలసి వస్తుంది."

"ఆ... దానికేంలెండి"

"అలా అనకండి. వ్యవహారం ఖచ్చితంగానే వుండాలి. మీరు ప్రేమించుకుని వివాహం చేసుకోవడానికి ఉత్సాహపడుతున్నప్పటికీ కన్నవారి విధాయకముండనే వుంది,. కట్నం కానుకల విషయంలో, మీరు విదేశాలకు వెళ్లి ఇంకా పెద్ద చదువు చదువుకోవాలని ఉత్సాహ పడుతున్నారు కాబట్టి అందుకు అవసరమైన యేయే ఖర్చులు నేను భరించి మీ చదువును సాగిస్తాను. ప్రస్తుతం అయిదువేల రూపాయలను మీ పేర బ్యాంకులో డిపాజిట్ చేయగలను" అని చెబుతూ వుంటే ప్రసాద్ కళ్లు ఆనందంతో మెరిసాయి.

"మీ చదువును, మీ అందమును మాత్రమే చూసుకుని నేను ఈ వివాహానికి సంతోషంగా అంగీకరిస్తున్నాను. మీ ఇంటి స్థితిగతులను గురించి నాకెటువంటి భోగట్టాయున్నూ అవసరంలేదు."

"అయినప్పటికీ చెప్పడం నా విధి. ఇదిగో ఈ మేడ, పది ఎకరాల పొలముంది. సాలీనా అయిదువందల రూపాయలు మాత్రం వస్తాయి."

"వద్దండి. అవేమీ నాకవసరంలేదు. నాకు చెప్పొద్దు. అమ్మాయిని మీరు ప్రేమించడం, ఆమె మిమ్మల్ని ప్రేమించడం... ఇదే మాకు పదివేలు. అంతకంటే ఇంకేమీ అవసరంలేదు. మీకిష్టమయితే అమ్మాయిచేత ఇంకా పై చదువు చదివించుకోవచ్చు. లేకపోతే ఇంతటితో మానిపించవచ్చు."

"అలాగేనండి."

"నాకొక్క సందేహం మాత్రం వుందండి."

ప్రసాద్ మాట్లాడలేదు.

"మీరింతవరకూ వివాహం చేసుకోకుండా ఉండడానికి కారణమేమిటి?"

ఆ ప్రశ్న వినగానే ప్రసాద్ ఎందుకో కంగారుపడ్డాడు.

"ఏమంటారు?"

"ఆ... వివాహమా అండీ?... ఆ కాలేదు, కా...లేదు..." అని తడబడుతూ చెప్పాడు.

"బహుశా చదువు పూర్తి కాకుండా చేసుకోవడం మంచిపనిగాదని వూరుకుని వుంటారు."

"అంతే...అంతేనండి. చదువు పూర్తి అయినాక చేసుకుందామని..."

"నేనూ అలాగే అనుకున్నానులెండి"

"మీ పేరేమిటో అడగడం మరచిపోయాను"

"రాజశేఖరం అంటారు."

"అసలు నివాసమే విశాఖపట్నమా అండీ?"

"అవును. రాజమండ్రీలో మా చెల్లెలుంది. ఏలూరులో ఒక అన్నగారున్నారు."

"ఓహో రాజమండ్రీలో ఎవరండీ ఉన్నారు?"

"మా చెల్లెలు"

"ఎవరండి"

"మా బావమరిది తాలూకాలో పని చేస్తున్నాడు. మీకు కూడా రాజ

మంద్రీలో ఎవరైనా ఉన్నారా ఏమిటి?''

"అబ్బే... ఎవరూ లేరండి. వూరికెనే అడుగుతున్నాను''

"అయితే వెంటనే ముహూర్తం పెట్టించమన్నారా? వివాహం విశాఖపట్నంలో''

"మంచిది కానీయండి''

"ఈవారంతో అమ్మాయికి పరీక్షలు అయిపోతాయి. అంతవరకూ నేను కూడా ఇక్కడే ఉంటాను. సెలవులీయగానే తీసుకెళ్లిపోతాను. మీరు కూడా మాతో వచ్చేయండి''

"అలాగే చేయండి''

"అయితే మన వూళ్లోనే మా స్వంత పురోహితుడిచేత ముహూర్తం వగైరా ఏర్పాట్లను చేయిద్దామంటారా?''

"మీ ఇష్టం. అలాగే కానీయండి. ఈ వివాహం అయిన వెంటనే నేను లండన్ వెళ్లదల్చుకున్నానండీ''

"ఓ...అభ్యంతరంలేదు. మీరడిగిన తక్షణం మీకు అవసరమైన సొమ్మును ఈయడానికి సిద్ధంగా ఉన్నాను.''

"మంచిది''

"అయితే ఇక నేను వెళ్లొస్తానండీ. ఈ వారంలోజులూ ఇక్కడే ఉంటానుకాబట్టి తిరిగి కలుసుకుందాము. రేపు ఆదివారం కాబట్టి అమ్మాయీ నేనూ కలిసే వస్తాము'' అని అప్పటికి కాబోయే అల్లుడి దగ్గర సెలవు పుచ్చుకుని వెళ్లిపోయాడు రాజశేఖరం.

ప్రయత్నం లేకుండా ఈ విధంగా అన్నీ కలసివచ్చినప్పుడు జారవిడుచుకోవడమెందుకు? రాజామణి వంటి విద్యావతిని భార్యగా పొందబోతూ వున్నందుకు నేనంతగానో గర్వపడవచ్చు. అంతే కాకుండా నా చదువుకు అవసరమైన డబ్బును పెట్టుబడి పెడతానంటున్నాడు. అదృష్టమంటే ఎవర్కైనా కలసి రావాలి.''

ఆ రాజామణిని గురించి నెలల తరబడి చేసిన ప్రయత్నం వృధా పోలేదు. నూటికి నూరుపాళ్లు ఫలించింది. ఆమె విద్యావతి, నాగరికురాలు, వివేకవంతురాలు.

నన్ను హృదయపూర్వకంగా ప్రేమించింది. నేనామెను హృదయపీఠాన నిలుపుకుని నిత్యమూ ఆరాధిస్తూనే ఉన్నాను. భగవంతుడు మా ఇరువురి వివాహానికి ఎటువంటి అంతరాయమున్నూ కలిగించకుండా నిర్విఘ్నంగా కొనసాగించుగాక' అని అతడు తనలో అనుకుని నౌకరు కుర్రానికి చెప్పి క్లబ్బునకు బయలుదేరాను. మార్గమధ్యంలో మూర్తి ఎదురై-

"ఏమోయ్! ఈవేళ క్లబ్బుకింత ఆలస్యంగా బయలుదేరావేం?'' అని అడిగాడు.

"ఇప్పుడు నీకొక శుభవార్తను చెప్పదల్చుకున్నాను.''

"ఏమిటదీ?''

"విశాఖపట్నం నుంచి రాజామణి తండ్రిగారొచ్చారు''

"అలాగా... నాకు కనిపించలేదే''

"ఈవేళే వచ్చాను. నిన్నూ కలుసుకుంటారనుకుంటా. ఇంకా వారంరోజులుంటారట ఇక్కడ''

"నీ దగ్గరకొచ్చారా?''

"అవును''

"ఏమిటీ విశేషం?''

"మేరేజ్ సెటిల్ చేసారు.''


"యు ఆర్ ఎ లక్కీబోయ్... ఏమిటీ చెప్పావుగావూ?''

"ఏదీ ఇప్పుడేగా వారు నా గది దగ్గరకు వచ్చింది.''

"ఆయనకు నీ విషయం ఎలా తెలుసు?''


"రాజామణి ఉత్తరం రాసి ఇందును గురించి తండ్రిగారిని ఇక్కడకు రప్పించింది.''

"నువ్విప్పుడింతకీ చాలా గొప్ప ఛాన్సు కొట్టేసావు. నాకు తెలుసు. ఆ రాజామణి కింతవరకూ ఏ వంద సంబంధాలో వచ్చాయి. కానీ ఆమెకి ఏ



## సొంత గూటికి మమతా!

'కేడీ' చిత్రం తన కెరీర్‌కు మేలు చేస్తుందని ఎంతగానో ఆశపడింది మమతా మోహన్‌దాస్. పాపం... కానీ ఆమె అడియాసే అయింది. ఆ చిత్రం ఫ్లాప్ కావడంతో మమతను పట్టించుకునేవారు కరువయ్యారు. తెలుగు చిత్రాల్లో ఇక తన ఉనికి ప్రశ్నార్థకం అనుకుందేమో తిరిగి కేరళకు వెళ్లిపోయింది. మళయాళంలో రెండు మూడు చిత్రాలను ఒప్పుకున్నట్లుగా చెబుతోంది మమత. సో... తెలుగులో అదృష్టం కలసి రాకపోయినా మళయాళ చిత్రాల్లోనైనా ఆమె బిజీ కావాలని కోరుకుందాం!



పెళ్లికొడుకూ నచ్చాడుగాడు. ఈ కాలానికి నువ్వు ఆమె కళ్లకు నవ మన్మ ధుడవై అవతరించావు కాబట్టి ఆమె తన ప్రేమ సామ్రాజ్యానికి నిన్ను నాధుడిగా చేసుకుంది.''

"ఏమిటీ కవిత్వమంతా?''

"మరి టీపార్టీ ఎప్పుడు చేస్తావు?''

"నీ ఇష్టం. ఎప్పుడు కావాలంటే అప్పుడు''

"మామూలు టీపార్టీలు నాకు పనికిరావు.''

"ఊ...ఏ రిఫ్రెష్‌మెంటు రూముకయినా తీసుకెళ్లాలా ఏమిటి?''

"ఛా...''

"మరేమిటి?''

"స్నేహితులందర్నీ పిలిచి ఓ పెద్ద డిన్నరు చేయాలి''

"అలాగే అంతేకదా''

"నువ్వు తరచూ క్లబ్బుకు వెళ్లి వస్తూ ఉండడంచేతనే ఆ హాస్టల్ పిల్ల నీ వలలో పడింది. అందుకని క్లబ్బు స్నేహితులందర్నీ డిన్నర్‌కు ఆహ్వా నించాలి.''

"తప్పకుండా అలాగే చేద్దాము. అందులో పోయిందేముంది? అవుతే ఓ వంద రూపాయలు ఖర్చు అంతేకదా''

"అలా అనడంగాదు చేయాలి''

"పెళ్లి అయినాకనా? అవకుండానా?''

"ఇంతవరకూ వచ్చాక పెళ్లవకుండా మానుందా ఏమిటి? పోనీ అయి నాకనే చేయి''

"అయితే నువ్వు మీ ఆడవాళ్లు అందరూ విశాఖపట్నం పెళ్లికి తప్ప కుండా రావాలి. నాకు ఎవ్వరూలేరు. స్నేహితులయినా పదిమందికి రాక పోతే ఎలాగ?''

"తప్పకుండా వస్తాము. ఆ రాజశేఖరంగారిది చాలా పెద్దకుటుంబం. ఆయన తాలూకు ఏ వందమందయినా వస్తారు.''

"అటువంటప్పుడు మన తరఫున ఓ పాతికమందయినా రాకపోతే ఎలాగ?''

"నీకా భయం అక్కర్లేదు. స్నేహితులందర్నీ కుటుంబసమేతంగా తీసుకువెళ్తాము.''

"అవును. అది మంచిది. అందరకు దారి ఖర్చులు కూడా మనమే భరి స్తాము.''

"భేష్... ఉదారబుద్ధి అంటే అలా ఉండాలి. క్లబ్బుకు కాబోలు వెళ్లిరా'' అని అప్పటికి మూర్తి స్నేహితుణ్ని విడిచిపెట్టాడు.

***

"స్త్రీ ప్రణయదేవత అనీ, ప్రేమమూర్తి అనీ, సృష్టికి మూలకారకులనీ ఎన్నెన్నో చెబుతారు. కానీ నన్నడిగితే అంతకంటే పాపపు జన్మ మరొకటి లేదంటాను.

ఎందుకొచ్చిన బ్రతుకు? పరాధీనత, నిస్సహాయత స్త్రీలనే మూర్తీభ వించి ఉన్నాయని నేను చెబుతాను. ఇటు కన్న తల్లిదండ్రులను, అటు కట్టుకున్న భర్తను కూడా తృప్తిపరచలేక పోయినాక, ఎందుకు? పుట్టినది మొదలుకుని ప్రాజ్ఞురాలయ్యేవరకు తల్లిదండ్రుల చెప్పుచేతల్లోనూ, అనంతరం భర్తయొక్క అదుపాజ్ఞలలోనూ, ఆ తరువాత బిడ్డల చేతుల్లోనూ అణిగి ఉండవలసిందేగానీ ఆడదానికి చచ్చేవరకు స్వాతంత్ర్యంలేదు. ఇందులో ఎవరి ఆజ్ఞ పాటించకపోయినా ఆ స్త్రీని లోకం హర్షించదు.

వారు కోరిన అయిదువేలూ ఇచ్చి పిల్లను అత్తవారింటికి పంపడం మంచిదని, అమ్మ చెప్పింది కాబట్టి నీకు తెలీదు, నోరు మూసుకో అని వూరుకున్నాడు. ఆ మాటలే నా నోటంట వచ్చిననాడు నాన్నగారికి నేను గర్భ విరోధినై పోవలసిందేకదా!

అటు వారేమనుకుంటున్నారూ! తండ్రికొకవేళ ఇష్టం లేకపోయినప్ప టికీ నేను చెప్పి వారు కోరిన సొమ్మును ఇప్పించానుగానని ప్రేమబం ధాన్ని శాశ్వతంగా తెంచేసుకున్నారు. వెనుక గొయ్యి ముందుకొస్తే నుయ్యి... స్త్రీ జీవితం ఇంతేకదా! ఇవికాక లోకుల బాధ అన్నింటికీ మించి నది.

'డబ్బు ముఖం చూసుకుని ఈడేరిన పిల్లను అత్తవారింటికి పంప కుండా శాశ్వతంగా తన ఇంటనే వుంచేసుకున్నాడు' అని ఒకరు-

'అదికాదు, ఆమె గుణం మంచిదిగాక భర్త విడిచిపెట్టేసాడు. ఈ విషయం వెల్లడవుతే బావుండదని, అతడు డబ్బు కోరాడని చెబుతు న్నారు' అని మరియొకరు-

'తల్లిదండ్రులకు బుద్ధి లేకపోతే వయసొచ్చిన ఆ పిల్లకయినా బుద్ధి లేదా? వారు కాదన్నప్పటికీ తన భర్త దగ్గరకు తాను పోవడం విధి కాదా?' అని వేరొకరు

'భర్త ఎడల ఆ అమ్మాయికే ఇష్టంలేదు. కనుకనే మొగరాయుళ్ళాగా ఆజాన్మాంతం పుట్టింటనే పడి వుండడానికి నిశ్చయించుకుంది' అని మరి కొందరు...

ఈ విధంగా లోకమంతా ఎవరి నోటికొచ్చినట్లు వాళ్లనుకోవడమే తప్ప ఇందులో నిజమెంత? అబద్ధమెంత? న్యాయమేది? అన్యాయమేది? అని ఏ ఒక్కరూ ఆలోచించరుకదా.

క్రమంగా సంవత్సరాలూ, నెలలు కూడా గడిచిపోతున్నాయి. ఇక నా బ్రతుకు ఇంతే కాబోలు!

అనుకూలుడైన భర్తను పొందగలిగి వారి ప్రేమకు పాత్రురాలినై చివరి కెటువంటి బ్రతుకు బ్రతకవలసి వచ్చింది? వారికి అయిదువేల రూపాయ లమందు నేనొక గడ్డిపోచకయినా పనికిరాకుండా పోయినానన్నమాట. ఈ గుక్కెడు ప్రాణాలనూ ఏ నూతిలోనో, గోతిలోనో విడిచి పెట్టేసినట్ల యితే ఇటు కన్నవారికీ నా మూలంగా అపయశం రాకుండా పోతుంది. అటు కట్టుకున్నవారూ వేరొక కన్యనయినా వివాహం చేసుకుని ఇకముం దునుంచయినా సుఖపడతారు.

అంతేగానీ, అనవసరంగా నా మూలంగా ఆ ఇద్దరకూ కూడా కష్టం కలిగించడమెందుకు? నేటి ప్రపంచంలో డబ్బు లేకపోతే ఎవరూ ఎందుకూ కొరగారన్నమాట?

నాన్నగారితో దెబ్బలాడి తమకు అయిదువేలూ ఇప్పించలేదని వారు తమపై నాకు ప్రేమ లేదంటున్నారు. అంతేగానీ డబ్బునే ప్రధానంగా చూసుకుంటూ వున్న తమకే నా ప్రేమలేదని అనుకోరు. ఎందుకనుకుం టారు. తమ తప్పును తాము తెలుసుకున్నవారు భగవంతుడితో సమానం.

చివరికి ప్రపంచం ఏ విధంగా మారిపోయింది?' అని ఒకనాడు అమ్మడు తన యొక్క స్థితిని తల్చుకుని తనలో తానే విచారిస్తూ కూర్చుని వున్న సమయంలో తల్లి ఏదో ఉత్తరమును పట్టుకొచ్చి కూతు రుకిచ్చి -

"ఈ ఉత్తరం ఎక్కడిదో చూడు అమ్మడూ?'' అంది.

అమ్మడు దానిని చూచి "రాజామణి రాసిందే'' అని దానిని ఈ

విధంగా చదవడం మొదలపెట్టింది.

**విశాఖపట్నం, 2-9-37**

'ప్రియ స్నేహితురాలు అమ్మడికి

నువ్వు నీ కార్యానికి నన్ను పిలువకపోయినా నాకు జరగబోవు ఈ శుభముకు నీకు తెలియజేయడము, ఆ సమయానికి నిన్నిక్కడకు రప్పించడమూ నాకు విధి.

వచ్చే ఇరవై తొమ్మిదో తారీకు సాయంకాలం ఆరుగంటల వేళ నేనొకరికి భార్యగా అంకితం కాబోయే శుభసమయం నాటికి నువ్వు, మీ నాయనగారు, అమ్మగారు విధిగా ఇక్కడ ఉండి తీరాలి. ఆది నా ఆజ్ఞ అనుకోలేదు ప్రార్థన.

మనమిద్దరం బాల్య స్నేహితులం. చిన్నప్పటినుంచీ ఒకేచోట ఆడుకున్నాము. చదువుకున్నాము కాబట్టి ఆ శుభ సమయాన నీ ఆశీర్వచనం నాకు ముఖ్యం, అమూల్యం.

నువ్వా సమయానికి రాకపోయినట్లయితే నా ఆనందాన్ని, నా సౌఖ్యాన్ని పాడుచేసినదానవవుతావనీ, నువ్వు లేకపోతే ఆ శుభ కార్యానికి నిండే ఉండదని మరీ మరీ చెబుతున్నాను.

నెచ్చెలి

రాజామణి'

***

అస్తమయ సూర్యుడి లేత నీరెండలు, పచ్చని చెట్లకూ, సముద్ర జలానికి పసిడి మెరుగులుపెట్టి ప్రకృతిని మరింత శోభామయం చేస్తున్నాయి. వివిధ కాంతులతో వెలుగుతూ ఉన్న అప్పటి పశ్చిమ దిక్కాంతను చూచి ఓర్వలేక మూతి ముడుచుకున్నట్లు తూర్పుదెస క్రమంగా నల్లబారుతుంది. అప్పుడప్పుడూ నీటితుంపరులతో కలసివచ్చే చల్లగాలి, అక్కడ ఒక ఇసుకతిన్నె మీద కూర్చున్న మూడు ప్రాణులకూ హాయిని కలిగిస్తున్నాయి.

"రాజామణీ! నీముందు ఈ ప్రకృతిశోభ, ఇసుకతిన్నెలు, అస్తమయ సూర్యుడు, మలయమారుతము ఏవీ కూడా ప్రసాద్‌కు ఎక్కువ సంతోషాన్ని కలిగించలేకుండా ఉన్నట్లున్నాయి"

మూర్తి ఛలోక్తికి ప్రసాద్ ఏమంటాడో అని ఎదురు చూస్తున్నాడు. కానీ ప్రసాద్‌కు ఆ మాటలే వినిపించినట్లులేదు.

అతడు సముద్ర కెరటాలవైపు చూస్తూ దేని గురించో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

"దేవరవారన్య మనస్కులై యున్నట్టున్నారు" అని రాజామణి కిల కిలా నవ్వింది. దాంతో ప్రసాద్ ఉలిక్కిపడి-

"ఆ" అన్నాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

"ఏమీలేదే?"

"మూర్తి ఏమన్నాడో విన్నారా?"

"ఏమన్నాడు?"

"మీ మనస్సెక్కడుందో దీనిబట్టయినా తెలియడంలేదూ"

"నిజంగా నేను వినలేదు. చెప్పు మూర్తి ఏమన్నాడు?"

"గోల్డెన్ వర్డ్స్ కెన్ నాట్ బి రిపీటెడ్" అన్నాడు మూర్తి.

"పాపం వినలేదుట మళ్లీ చెప్పు మూర్తి" అని రాజామణి సిఫార్సు చేయడంవల్ల మూర్తి తిరిగి-

"ఈ ప్రకృతిశోభ, ఇసుకతిన్నెలు, అస్తమయ సూర్యుడు, మలయమారుతము... ఇవేవీ కూడా రాజామణి ముందు ఎక్కువ సంతోషాన్ని కలిగించలేవు"

"ఎవరికి?"

"ప్రసాద్‌కు"

అనగా అతను, అతనితోపాటు రాజామణి పకపకా నవ్వారు.

"నా మనస్తత్వాన్ని నువ్వు బాగా కనిపెట్టావు మూర్తీ. నీ సైకాలజీకి నూటికి నూరుమార్కులు సరా" అని ప్రసాద్ కూడా నవ్వుతూనే అన్నాడు.

"అదేమిటి? ఆ నవ్వంత అస్వభావికంగా ఉందేమిటి?" అని రాజామణి ఆశ్చర్యంగా అంది.

"తెచ్చి పెట్టుకున్నాడు" అని మూర్తి అన్నాడు.

"ఈవేళ మీరేదో మాదిరిగా ఉన్నారెందుచేతనండీ. నాతో చెప్పరూ?" అని రాజామణి అడిగింది.

ప్రసాద్ మాటలాడలేదు.

"మీ ఇద్దరికీ కూడా కోపం రాకుండా ఉంటే నేనో మాటంటాను" అని మూర్తి అన్నాడు.

అదేమిటో చెప్పవలసిందిగా ఇద్దరూ నిర్బంధం చేసినమీదట మూర్తి-

"సాధారణంగా పెళ్లి కాబోయేముందు వధూవరులకిద్దరకూ కూడా అదోమాదిరి వింత కళ వస్తుంది. అది ప్రసాద్‌లో కనబడడంలేదు."

ప్రసాద్ మరింత తెల్లబోయాడు. మూర్తి సాహసం చేసి అలా అన్నాడెందుకో అని రాజామణి కంగారుపడింది.

"నిజం చెప్పాలంటే రాజామణీ! నువ్వు చేరువలో వున్నంతసేపూ నాకదో మాదిరి ఉన్మాదమో, మైకమో కలుగుతుంది. అది ఆనంద జనిత మయినదని మాత్రం చెప్పగలను" అని ప్రసాద్ చెబుతూ ఉంటే-

"కొంప తీశావోయ్.. పిచ్చాసుపత్రి ఈ వూళ్లోనే వుంది" అని మూర్తి అనగా అందరూ తిరిగి పకపకా నవ్వారు.

"కృష్ణుడి దగ్గర ఇటువంటివాడే వేడుక చెలికాడు" అని రాజామణి అంది.

"ఓహో నీ మొగుడు కృష్ణుడు, నేను వేడుక చెలికాణ్ణి, అయితే నువ్వు సత్యవా, రుక్మిణివా?" అని మూర్తి అడగ్గా-

"సత్యభామ పోలిక వద్దు, రుక్మిణినే" అని రాజామణి నవ్వుతూ అంది.

"అయితే సత్యభామలాంటి ఏ సవతయినా వచ్చి ఏ తులాభారం



నెపం మీదనో నీ మొగుణ్ణి తన్నుకుపోగల్దు.. భద్రం సుమీ!'' అని మూర్తి అంటే అప్పుడు ప్రసాద్ ముఖమెందుకో వెలవెలబోయింది. ఆ విషయం ఎవరూ గమనించలేదు.

"ఏమండీ అవునా?'' అని రాజామణి చిరునవ్వు ముఖంతో ప్రసాద్‌ను అడిగింది.

"అబ్బెబ్బే... ఎవరూ లేరు. ఎవరొస్తారు?'' అతడెందుకో తడబడుతూ సమాధానం చెప్పాడు.

"ఎవరూ లేరులెండి. రేపు అటువంటిదేమినావస్తే మీ మనస్సు చలిస్తుందేమోనని మూర్తి గూఢంగా అన్నాడు. దానిని మీరు గ్రహించలేకుండా ఉన్నారు'' అని రాజామణి తిరిగి అంది.

"చలించదు. నేననువంటి మోసం చేసేవాణ్ణని మీరందరూ అనుకుంటున్నారు'' అని ప్రసాద్ ఖిన్నుడై అన్నాడు.

"నీలాంటివాడే గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నాడట'' అని మూర్తి అనగా.

"నాకేం! నేనెందుకు తడుముకుంటాను'' అని ప్రసాద్ వారన్నదానికి ఏమో సమాధానాలు చెబుతున్నాడుగానీ అతని మనస్సెందుకో కలవరపడుతూనే వుంది. మాటలాడుతూనే అతడు "ఇక ఇంటికి పోదామా?'' అని అడిగాడు.

"అదేమిటండీ మనమిక్కడకొచ్చి ఒక అరగంటయినా కాలేదు. అప్పుడే వెళ్లిపోవడమేమిటి? ఇక్కడ ఎంతో హాయిగా ఉంది'' అని రాజామణి అనడంవల్ల ప్రసాద్ ఏమీ మాట్లాడలేదు.

"రాజామణి మాటయందు ప్రసాద్‌కు చాలా గౌరవముంది'' అని మూర్తి అనగా-

"ఉండదా మరి?'' అని రాజామణి సగర్వంగా అంది.

"ఇంతవరకూ మీరు మామూలు వ్యక్తులే. రేపీపాటికి శాస్త్రవిహితంగా భార్యాభర్తలు కాబోతున్నారు. కాలం తల్చుకుంటే ఎటువంటి మార్పయినా తీసుకురాగలదు. ప్రసాద్! నీకు తెలుసునో తెలియదోగానీ రాజామణికిప్పటికే రెండువందలమంది పెళ్లికొడుకులు అయినారు. కానీ ఆమెకెవ్వరూ నచ్చలేదు. చివరికి నీ టోపీలో పడిపోయింది'' అని మూర్తి అంటే-

"టోపీయేముందీ? నేనేం టోపీ వేసాను?'' అని ప్రసాద్ తిరిగి కంగారు పడ్డాడు.

"అబ్బా... అదేమిటోయ్ నేనేమన్నా అలా కంగారుపడతావు. టోపీ అంటే టోపీయేనా ఏమిటి? ఇదివరకు ఎంతమంది పెళ్లికొడుకులొచ్చినా మూతి వంకర, ముక్కు వంకర అని వంకలు పెట్టిన మనిషి నిన్ను చూడగానే ఈ ప్రపంచాన్నే మరచిపోయి ప్రేమవాహినిలో మునిగిపోయింది. అందుకనే నేను అలా అంటున్నాను''

"ఓ అదా... ఒప్పుకుంటాను. ఇది నా పూర్వ పుణ్యం. రాజామణి వంటి విద్యా నాగరికతలుగల యువతిని భార్యగా పొందడానికి నేనెటువంటి గొప్ప తపస్సుచేసి ఉండాలి'' అని ప్రసాద్ ఆనందోద్రేకంతో అనగా-

"ఇటువంటి నవమన్మధమూర్తి భర్త కావడం నా అదృష్టం మాత్రం సామాన్యమయినదా?'' అని రాజామణి అనగా-

అప్పుడు మాత్రం అతని పెదవులమీద ఒక చిరునవ్వంకురించి వెంటనే అదృశ్యమయింది. ఆ చిన్న నవ్వులోనయినా హాయి లేదు, ఆనందం లేదు.

రాజామణి అసాధ్యురాలు. అతని వాలకమునంతటినీ కనిపెడుతూనే వుంది.

***

అమ్మణ్ణి ఆడవాళ్ల పెట్టెలో ఎక్కించి తిరిగి వచ్చేనాడు టెలిగ్రాం ఇస్తే స్టేషన్‌కు హాజరవుతానని చెప్పి బండి కదలగానే ఇంటికి వెళ్లిపోయాడు.

రాజామణికి ఒక కాంజీవరం పట్టుచీర, ఒక వెండి కుంకుమభరిణ, రెండు చెమ్కీ పూలదండలు, ఈ కానుకలతో అమ్మడు స్నేహితురాలి పెళ్లికి ప్రయాణమై వెడుతూ ఉంది. ఆమె ఎక్కిన రైలు తన విద్యుక్త ధర్మాన్ని అనుసరించి మధ్య మధ్య స్టేషనులలో ఆగుతూ తిరిగి పొగలు చిమ్ముకుంటూ పరుగు తీస్తోంది.

'నా పెళ్లి సమయానికి పాపం రాజామణి కాకినాడ చదువులో వుంది. అవి ఆమెకు పరీక్ష రోజులు కూడాను. అందువల్ల రాలేకపోయింది. సరిగ్గా ఇటువంటిదే ఓ పట్టుచీర, ఒక కుంకుమభరిణె, పూలచెండ్లు నాకు కానుకలుగా పోస్టులో పంపింది. తాను స్వయంగా రాలేకపోతున్నందుకు ఎంతగానో నొచ్చుకుంది.

కార్యానికయినా వచ్చి నా భర్తను చూదామని మహా ఉబలాటపడింది పాపం. అయితే ఎందుకు? నాకీ జన్మలో అటువంటి యోగమే లేకపోయింది. తన్ను ఆహ్వానించకుండానే ఆ శుభ కార్యం అయిపోయిందనుకుంది కాబోలు.

'నువ్వు కార్యానికి పిలువకపోయినప్పటికీ...' అని ఏమో రాసింది. అమాయకురాలు. నిజంగా నాకటువంటి యోగ్యత కలిగిననాడు ఆమెకు తెలియజేసి ఆహ్వానించకుండా వుంటాననుకుంది కాబోలు.

ఆ వివాహం నాటి ఆనందం, అప్పటి సంతోషం తిరిగి ఎన్నడూ కలుగలేదు. ఇహనీజన్మలో అటువంటిది కలిగే ఆశ కూడా లేకుండా పోయింది.

సంవత్సరమయింది మళ్లీ ఎన్నడూ ఒక ఉత్తరంముక్కయినా రాశారు కాదు. ఇంకెందుకు వారు గుండె రాయి చేసుకున్నారు, ప్రేమపాశాన్ని తెంచేసుకున్నారు. డబ్బు ఎంత పాపిష్టిది.

వెధవ అయిదువేల కోసం పట్టుదల వహించి నూరేళ్లు గడపవలసిన ఆనందమయ దాంపత్య జీవితాన్ని దుమ్ములో కలిపేసారు. నాన్నగారిది కూడా అటువంటి పట్టుదలే అవడంవల్ల ఈ విధంగా జరిగింది.

అల్లుడికి అయిదువేలూ ఈయడం నాన్నగారికొక అపరాధంగానూ, వంచనగానూ తోచింది.

తరువాత ఇస్తామన్నా కూడా వారికి నమ్మకం లేకపోయింది. ఏమయితే ఎందుకు? అల్లుడు మామల మధ్య నా బ్రతుకు అనవసరంగా నలిగిపోయింది అని ఆమె తనలో తానింకా ఏమేమో ఆలోచించుకుంటూ రైలు పెట్టెలోంచి తలను అవతలకు పెట్టి తనకెదురుగా పరుగెడుతున్న చెట్లవయిపు, పొలాలవైపు, టెలిగ్రాం స్తంభాలవైపు పరధ్యానంగా చూస్తోంది.

'ఇవన్నీ పరుగెత్తడం అబద్ధం. నిజానికి రైలు పరుగెడుతూ వుందిగానీ, ఈ పొలాలు, ఈ చెట్లు, ఈ టెలిగ్రాం స్తంభాలు పరుగెత్తడంలేదు. అలాగే మానవుల నిత్య జీవితంలో కూడా అబద్ధమైనవి నిజంగా గోచరిస్తుంటాయి కాబోలు' అని ఆమె తనలో తాను అనుకుంటూ ఉండగా ఇంతలో ఆ ప్రక్కగా కూర్చున్న ఓ వితంతువు-

"మీదే వూరు బుల్లెమ్మా'' అని పలకరించింది.

అమ్మడు స్వప్నావస్థలోంచి ఉలిక్కిపడి లేచినట్లు ఆ వితంతువువైపు

చూచి "మాది రాజమండ్రం" అని చెప్పింది.

"ఇలా ఎక్కడికి వెళుతున్నావు?" అని ఆ వితంతువు అడిగిన రెండో ప్రశ్నకు-

"విశాఖపట్నం బామ్మగారూ"

"అక్కడ బంధువులున్నారు కాబోలు"

'అంతకంటే ఎక్కువయిన స్నేహితురాలొకామె వుంది. ఈ రాత్రి ఆమెకు వివాహం. అందుకని వెళుతున్నాను.'

"అలాగా... అయితే రాజమండ్రం మీ అత్తవారా? కన్నవారా?"

"కన్నవారే"

"అత్తవారిదే వూరు?"

"కాకినాడ"

"నీకేమయినా పిల్లలా?"

"లేరండీ"

"అత్తవారింటికి వెళ్లి ఎంత కాలమయింది?"

అమ్మడు మాట్లాడలేదు.

"అసలు కార్యమయిందా బుల్లెమ్మా?"

లేదన్నట్లుగా అమ్మడు తల పంకించింది.

"అయ్యో ఇదేమిటి. దగ్గర దగ్గర పద్దెనిమిదేళ్లున్నట్టున్నాయి. ఇంకా కార్యం అవకుండా ఉంటుందా?" అని ఆ విధవరాలు దవడలు నొక్కుకో వడంతో అమ్మడికిక ఆమె దగ్గర కూర్చోవడానికి ఇష్టం లేకపోయింది. వెంటనే అక్కడినుంచి లేచిపోయి ఆమె మరోవైపు కూర్చుంది.

'వచ్చే స్టేషను సామర్లకోట. అక్కడ దిగి ఇంకో బండెక్కితే కాకినాడ వెళుతుంది' అన్న ఆలోచన ఆమె హృదయంలో అప్రయత్నంగా తట్టింది.

'ఎందుకు? కాకినాడలో నాకేముంది? నా దేవుడికి నామీద దయతప్పి నప్పుడిక కాకినాడ నాకు శూన్య ప్రదేశమే. ఆ సుందర ముఖపద్మం చూసి సంవత్సరం పైగా దాటిపోయింది. ఏ సామర్లకోట ప్లాటుఫారం మీదన యినా వారు కనిపిస్తే'- అని ఆమె మనసుకు తోచగానే గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

'కనిపిస్తే నాతో మాటలాడతారా? మాటలాడరు. హాయిగా భర్త విడిచి పెట్టేసినప్పటికీ కూడా సిగ్గులేకుండా ఆ వూరూ ఈ వూరూ తిరుగుతున్నా ననుకుంటారు' అనుకుంది.

అయినప్పటికీ సామర్లకోట స్టేషన్ రాగానే ఆమె ప్లాటుఫారం నాలుగు వైపులా చూడకుండా ఉండలేకపోయింది.

చూస్తే ఏముంది?

ఆమెకి పిచ్చిగానీ భర్త అక్కడకెందుకొస్తాడు? ఆమె మెడలు పడిపో యేటట్లు చూసింది. రైలు తిరిగి ప్రయాణం సాగించింది.

స్టేషన్‌కు స్టేషన్‌కు ఆగుకుంటూ ప్రొద్దుట తొమ్మిదిగంటలకు రాజమం డ్రిలో బయలుదేరిన ఆ రైలు సుమారు ఒంటిగంట వేళకు విశాఖపట్నం చేరుకుంది.


అమ్మడు తన చిన్నసూటుకేసును పట్టుకుని రైలు దిగి ఒక జట్కా కట్టించుకుని పెళ్లివారింటికి బయలుదేరింది.

క్షణమాత్రకాలం తన సర్వదుఃఖాలను మరచిపోయి ప్రాణస్నేహితు రాలి వివాహానికి రాగలిగినందుకు ఆనంద సముద్రంలో మునిగిపో యింది. ఆరుగంటలకే శుభముహూర్తం అని జ్ఞాపకం రాగానే త్వరగా తోలవలసిందిగా బండివాడిని హెచ్చరించింది. మరికొంతసేపటికా జట్కాబండి పెళ్లి పందిరిలో ఆగింది.

రాజామణి వివాహం అంత వైభవంగా జరుగుతూ ఉందని ఆమె ఎన్నడూ ఊహించలేదు.

పెళ్లి పందిరి నిండా మామిడి తోరణాలు, రంగు కాగితాలు, పువ్వులు, జండాలు.. ఒక్కటేమిటి దేవేంద్రలోకమంతటి శోభాయమానంగా ఉందా పెళ్లిపందిరి.

ఒక చోట పాట కచేరీ జరుగుతూ వుంటే మరియొకచోట తంజావూరు సన్నాయి, మోడులు చిగిర్చేటట్లు పాడుతూ ఉంది.



## పాపం త్రిష!

'అనుకున్నామని జరగవు అన్నీ...' అన్నారొక సినీ కవి. చిన్న మాటలో జీవిత సత్యాన్ని ఎంత చక్కగా వివరించారు! ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే పాపం త్రిష పరిస్థితి కూడా ప్రస్తుతం అలాగే వుంది. తాను నటించిన తొలి హిందీ చిత్రం 'కట్టామీటా' తననెక్కడికో తీసుకుపోతుందని భ్రమపడింది. చిత్రం రిలీజై బాక్సాఫీసువద్ద చతికిలపడేసరికి వాస్తవంలోకి వచ్చింది. 'కట్టామీటా'లో తన నటనకు ప్రేక్షకులు మంచి మార్కులే వేసారని, ప్రస్తుతం తాను రెండు మూడు హిందీ చిత్రాల్లో నటిస్తున్నానని చెబు తోంది. బాలీవుడ్‌లో త్రిష ఎంతమేరకు రాణిస్తుందో చూడాల్సిందే!



ఒకచోట బేండు వాయిద్యము, మరియొకచోట నవభత్కానా, నవ నాగరికురాలి వివాహం కూడా అంత ఆడంబరంగా జరుగుతూ ఉందేనా అని ఆమె ఆశ్చర్యపోయింది.

క్రమంగా వాటినన్నింటినీ దాటి ఆమె లోపలకు వెళ్లగా అక్కడ రాజామణి తల్లి ఆమెకు కనిపించి-

"అయ్యో వచ్చావా తల్లీ! నువ్వు రావేమోనని నీ స్నేహితురాలు కొట్టుకుపోతోంది. ఈవేళ అప్పుడే నీకోసం రెండుసార్లు కంట తడి పెట్టుకుంది'' ఆమె అపరిమితానందభరితురాలై అంది.

"బండి కొంచెం లేటయినట్లుంది. లేకపోతే ఇంకా త్వరగా రాగలిగేదాన్ని'' అని అమ్మడు అనగా-

"అయితే అయిందిలే తల్లీ. ఎలాగయితేనేం సూత్రధారణం వేళకు ఊడిపడ్డావు. రా త్వరగా రా. మేడమీద పెళ్లిపీటలమీద కూర్చున్నారు'' అని చెప్పి రాజామణి తల్లి అమ్మడ్ని వధూవరులున్న మేడమీదకి తీసుకెళ్లింది. అమ్మడు స్నేహితురాలికోసం తెచ్చిన పెద్ద జరీ కాంజీవరం పట్టు చీర, వెండి కుంకుమభరిణ, పూవులదండలు మొదలైన వాటిని సూటుకేసులో నుంచి తీసి పెళ్లికుమార్తెగావున్న స్నేహితురాలికి సమర్పించడానికి వెడుతూ ఉంది.

ఇంతలో-

"రాజా! ఇదిగో వచ్చింది నీ స్నేహితురాలు అమ్మడు...ఆమె కోసం నీ ప్రాణం మహా కొట్టుకుపోయింది'' అని తల్లి ముందుగా అనేటప్పటికి రాజామణికి ప్రాణం లేచివచ్చినట్లయింది.

"వచ్చావా అమ్మడూ వచ్చావా! ఎక్కడ?'' అని ఆమె పెళ్లిపీటల మీద నుంచే ఆనందోద్రేకంతో అరిచింది.

ఆ మేడమీది వివాహ మండపం నిండా ఒకవయిపు చిన్నలు, మరోవయిపున పెద్దలు, ముత్తయిదువులు, యువకులు, యువతులు, అంతా మొత్తం నాలుగువందలమంది కిక్కిరిసి ఉన్నారు. మరి కొందరు వెనుక తట్టు నిలుచున్నారు. అడుగు పెట్టడానికయినా వీలులేకుండా వున్న ఆ జన సమర్థంలోంచి తల్లి అన్న మాట వినపడిందంతేగానీ రాజామణికి అమ్మడెక్కడా కనిపించలేదు. రాజామణి ఆనందోద్రేకంతో పంపిన ఆహ్వానాన్ని అమ్మడు అందుకుంది. కానీ ఆమె ముఖం ఎక్కడా కనుపించడం లేదు.

"కొంచెం తప్పుకోండి నాయనా... ఈ బుల్లెమ్మనలా వెళ్లనీయండి'' అని పెళ్లికుమార్తె తల్లి అనగానే అక్కడ మూగివున్న వాళ్లందరూ అమ్మడికి, ఆమెతోపాటు రాజామణి తల్లికి దారిచ్చారు.

అడ్డుగా కూర్చున్న జనాన్నందరనూ మెల్లగా తప్పించుకుంటూ అమ్మడు తను పెళ్లికూతురుకు తెచ్చిన కాన్కలను పట్టుకుని పెళ్లిపీటల దాపుగా వెళ్లింది. పురోహిత మంత్ర వాక్యాలతో అంతా హడావుడిగా ఉంది.

అమ్మడు వణుకుతున్న చేతులతో తాను తెచ్చిన కానుకలను పెళ్లికూమార్తెకందించి ఒక పూలదండను ఆమె మెడలో వేసి రెండో దండను పక్కగా నిల్చున్న పెళ్లికొడుక్కివ్వబోతూ అతని ముఖం చూసి నిశ్చేష్టురాలైపోయింది. తన కళ్లను తానే నమ్మలేకపోయింది.

అతడు తనను అగ్నిసాక్షిగా వివాహమాడిన తన భర్త ప్రసాద్!

ఆమె చేతిలోని దండ అప్రయత్నంగా కిందకి జారిపోయింది. ఆమె తల తిరిగిపోయింది.

కళ్లు నీళ్లు చిమ్మాయి. ప్రసాద్ కూడా ఆమె ముఖంలోకి చూసాడు. వెంటనే సిగ్గుపడి తలను కిందకు దించేసుకున్నాడు. రాజామణి ఆ దృశ్యమునంతటినీ కనిపెడుతూనే వుంది.

అమ్మడు సర్వమును అర్థం చేసుకుంది. తన తండ్రి అయిదువేలూ ఈయలేదన్న కక్షచేత తన భర్త రాజామణిని పునర్వివాహం చేసుకుంటూ ఉన్నాడని గ్రహించుకుంది. ఆ సమయంలో ఈ విషయాన్ని వెల్లడిచేసి ప్రాణస్నేహితురాలి ఆనందానికి అంతరాయం కలిగించడానికి ఆమె సమ్మతించలేదు.

తానింకా అక్కడే ఉన్నట్లయితే వివాహానికి విఘ్నం కలుగుతుందేమోనని భయపడి ఇక అక్కడ నిలుచోకుండా వెళ్లిపోవాలని నిశ్చయం చేసుకుంది.

వణుకుతున్న చేతులతో పెళ్లి కుమార్తెగా అలంకరింపబడిన రాజామణిని ఒక్కసారి కౌగలించుకుని-

"అక్కా! నేను వచ్చిన పని అయిపోయింది. వెళ్లిపోతున్నాను. మీ నూతన దంపతులను భగవంతుడు రక్షించుగాక'' అని శోకరుద్ధమైపోయిన కంఠంతో అని అక్కడ ఇక నిలుచోలేకపోయింది. కళ్లంట అశ్రుధారలు సంతతధారలై ప్రవహిస్తున్నాయి. రాజామణికేమీ అర్థంకాలేదు. కాబోయే భర్త ముఖం లోకి చూసింది.

అతని ముఖాన కత్తివాటుకు నెత్తురుచుక్కలేదు. తిరిగి చూసేటప్పటికి అమ్మడు అక్కడలేదు.

అక్కడ వున్న జన సమూహాన్ని తప్పించుకుని మేడ దిగిపోయింది. ఆ దృశ్యాన్ని అందరూ తెల్లబోయి చూస్తున్నారు. పురోహితులు మంత్ర వాక్యాలనాపుచేసారు.

రాజామణి ఆమెతోపాటు తల్లిదండ్రులు పరుగెత్తిపోతున్న అమ్మడి వెనకాల పరుగులెత్తారు. అమ్మడు అప్పటికప్పుడు రోడ్డుమీదవుంది. ఆగకుండా వున్న కన్నీటి ధారలతో జట్కా బండికోసం ఎదురుచూస్తోంది. రాజామణి తల్లిదండ్రులు ఆమెను పట్టుకుతీసుకువచ్చారు. రాజామణి ఆమె చేయి పట్టుకుని తన గదిలోకి తీసుకెళ్లి హృదయానికామె శిరస్సు ఆనించుకుని-

"అమ్మడూ! నీకేమయినా మతిపోయిందా? పిచ్చా? వచ్చి క్షణమయినా అయిందోలేదో ఎక్కడికలా పరుగెడతావు? ఈ యేడుపెందుకు? నేను నీ రాజునుగానూ నాతో చెప్పవూ. నువ్వు వస్తావో రావో అని నేనెంతగా ఏడ్చానో నీకేమైనా తెలుసా? చెప్పమ్మా చెప్పు. పెళ్లి పీటల దగ్గరకి రాగానే అలా మారిపోయావెందుకు?'' అని రాజామణి ఎన్నివిధాల బుజ్జగించి అడిగినా కళ్లనుంచి వేడి కన్నీటి ధారలను కురిపించడంకంటే ఏమీ సమాధానం చెప్పలేకపోయింది. రాజామణి తల్లిదండ్రులకేమీ అర్థం కాక శిలాప్రతిమల్లాగా అలాగే నిలుచుండిపోయారు.

"రాజా! తెలియక వచ్చాను. ఈ విషయం ఇటువంటిదని తెలిస్తే రాకపోదును'' అని అమ్మడు రాజామణిని కౌగలించుకుని వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టింది. ఆమె స్థితిని చూస్తుంటే రాజామణికి ముచ్చెమటలు పోసాయి. ఆ చెమటలకామె నొసటనున్న కళ్యాణ బొట్టు కరిగిపోయింది.

"ఏ విషయం అమ్మడూ... నాతో చెప్పమ్మా.. నిన్నెవరైనా ఏమయినా అన్నారా? మన ఇద్దరకూ ఎటువంటి స్నేహం? ఎంత ప్రాణం... నాతో చెప్పు''

"వద్దు రాజా! నన్నేం అడగొద్దు. నేనేమీ చెప్పను. నీ ఆనందాన్ని భగ్నం చేయడానికి నేను వచ్చినట్లయింది. నీ సంతోషం నామూలంగా

నాశనమైపోయింది. వద్దు...వద్దు... నన్ను వెళ్లిపోనీయండి'' అని ఆమె దుఃఖించడం మొదలుపెట్టింది. ఎవరికీ ఏమీ అర్థం కాలేదు.

"అవతల ముహూర్తం మించిపోతుందేమోనే రాజూ... సూత్రధారణ కావాలి'' అని రాజామణి తల్లిదండ్రులు కూతుర్ని తొందరపెట్టారు.

"ఉండండర్రా! ఈమె ఈ విధంగా వుంటే ఏం తోస్తుంది? నా భర్త ముఖంలోకి చూసీ చూడడంతోనే ఈమె ఇలా మారిపోయింది. ఇందులో ఏదో రహస్యం ఇమిడి వుంటుంది. తప్పదు. అదేమిటో కనుక్కోవాలి'' అని రాజామణి దృఢనిశ్చయంతో అనగా-

"రాజూ! లేదు... నువ్విప్పుడు తెలుసుకోవాలసిందేమీలేదు,. నీకు దణ్ణం పెడతాను. వెళ్లు ముహూర్తం దాటిపోనియ్యకు'' అని అమ్మడు స్నేహితురాలి రెండు చేతులూ పట్టుకుని బ్రతిమిలాడింది.

"అలా అంటే నేనొప్పుకోను. నీ మనసులోవున్నదేమిటో నాకు చెప్పాలి తప్పదు''

రాజామణి అంటూ ఉండగానే అమ్మడు దొంగతనంగా అక్కడికి నుంచి పారిపోవాలని చూసింది.

కానీ రాజామణి ఆమెకటువంటి అవకాశం ఇవ్వకుండా తిరిగి పట్టుకుని-

"అమ్మడూ! నువ్వే చేసేది మంచి పని కాదు సుమీ. త్వరగా చెప్పు అదేమిటో? ప్రసాద్‌ను నువ్వింతకుముందే ఎరుగుదువా?'' అని అడగ్గా అమ్మడు వెక్కివెక్కి ఏడుస్తూ-

"అయ్యయ్యో ఇక్కడకు రావడం ఎంత పొరపాటు అయిపోయింది రాజూ. నాన్నగారూ... అమ్మా వద్దు అన్నారు. ఇటువంటి శుభ సమయంలో రాకపోతే నీ మనసుకు నొప్పి కలుగుతుందని వాళ్లనెలాగో ఒప్పించి వచ్చాను. ఏం లాభం? అంతకంటే ఇప్పుడు నీ మనస్సుకు నా మూలంగా ఎక్కువ నొప్పి కలుగుతోంది. స్నేహితురాలికి వివాహమవుతుంటే కళ్లారా చూచి కలిగిన కానుకలర్పించి పోదామని వచ్చానంతేగానీ నామూలంగా నీ ఆనందం ఈ విధంగా భగ్నమైపోతుందనుకుంటే నావల్ల నీ వివాహానికి ఇటువంటి అంతరాయం కలుగుతుందని తెలిస్తే ఈనా రాకవల్ల సర్వనాశనమూ అయిపోతుందని ఎరిగివుంటే ఎందుకు వస్తాను?

రాజూ! నువ్వు నాకు తోడబుట్టినదానికంటే ఎక్కువదానవు. నీ ఆనందానికి, నీ భావి సౌఖ్యానికి నా మూలంగా అంతరాయం కలగడమును నేను చూడలేను, భరించలేను. నన్నింక ఏమీ అడగవద్దు. నా దుఃఖాన్ని ఎక్కువ చేయవద్దు. నీ వివాహానికి విఘ్నం కలిగించుకోవద్దు. వెళ్లు త్వరగా వెళ్లు. ముహూర్తం మించిపోతుందంటున్నారు. నా మాట విను నీకెంతయినా పుణ్యముంటుంది'' అని అమ్మడు ఏడుస్తూనే స్నేహితురాలిని అనేక విధాల బ్రతిమాలుతూ ఉండగా ఇంతలో మేడపైనున్న వివాహ మంటపంనుంచి పురోహిత బ్రాహ్మణులు, పెళ్లి చూడవచ్చిన పెద్దలు, చుట్టాలు అందరూ కిందకి వచ్చేసారు.

"ఏమండోయ్ కన్యాదాతగారూ! ఏమిటీ ఆలస్యం? ముహూర్తానికి ఇంక రెండు నిముషాలకంటే ఎక్కువ వ్యవధిలేదు. ఇంత ప్రయత్నమూ చేసుకుని భేషైన ముహూర్తాన్ని చేతులారా దాటబెట్టేసుకునేలా ఉన్నారు'' అని పురోహిత పెద్ద తొందర చేసాడు.

"ఏమిటమ్మాయ్ ఏమిటిది... శనిగాడిలాగా ఈ పిచ్చిపిల్ల ఎవరో సరిగ్గా సూత్రధారణ సమయానికి వచ్చిపడింది ఎక్కడనుంచో. ఆమెతో ఏమిటి మీరందరూ లేచి రండి. చూస్తూ చూస్తూ ముహూర్తం దాటబెట్టేసుకుంటారా యేం?'' అని మరికొందరు పెద్దలు హెచ్చరించారు.

"రాజూ! రాజూ! చూసావా అందరూ ఇక నన్నే అంటారు. నీకెంతయినా పుణ్యముంటుంది. వెళ్లు. వెళ్లకపోయినట్లయితే నన్ను చంపుకున్నంత ఒట్టు. ముహూర్తం దాటపోనీయకు. నీ కాళ్లకు మొక్కుతాను. నన్నేమీ అడగొద్దు. వెళ్లు... ఒట్టు పెట్టినా వెళ్లవు...'' అని అమ్మడు రాజామణి కాళ్లమీద పడి మొక్కింది కాని కదలడంలేదు.

ఇంతలో మూర్తి హడావుడిగా మేడమీదనుంచి వచ్చి "తప్పుకోండి...తప్పుకోండి'' అంటూ జన సమూహాన్ని తోసుకుని రాజామణి మొదలైన వారి దగ్గరకు వచ్చి-

"ఆగు రాజూ! ఆగు. వ్యవహారమంతా తేలిపోయింది. ఆ అమ్మాయి నేమీ బాధపెట్టకు. విషయమంతా నేను నీకు చెబుతాను'' అనడంతో రాజామణి, ఆమె తల్లిదండ్రులు, అందరూ అతను చెప్పినదాన్ని వినడానికి నిశ్శబ్దమును వహించారు. మూర్తి చెప్పడం మొదలుపెట్టాడు.


"ఈ అమ్మాయి రాజమండ్రంలోని శ్రీపతిగారి కూతురు. ఈమెను ప్రసాద్ వివాహమాడి రెండు సంవత్సరాలయింది. ఐసియస్‌కు లండన్‌కు వెళదామని మామగార్ని అయిదువేల రూపాయలు అడిగాడుట. ఆ సొమ్మును ఆయన ఈయని కారణంవల్ల ఈ అబ్బాయి ఆ విషయమంతటినీ మరుగుపరిచి ఇప్పుడు రాజామణిని తిరిగి పెళ్లి చేసుకోవడానికి తయారయ్యాడు.

ఈ అమ్మడికి పాపమీ గొడవ తెలియకపోవడంవల్ల మామూలుగా స్నేహితురాలి వివాహం చూసి పోదామని వచ్చి తన కంఠమను కోయబోతూవున్న భర్తను చూసి దుఃఖసముద్రంలో మునిగింది. ఈ రహస్యగాథనంతటినీ చెబితే వివాహం చెడిపోతుందేమోనన్న ఉదారబుద్ధితో మీరెన్నివిధాల అడిగినా చెప్పకుండా ఉంది'' అని మూర్తి మాటలనాలకించిన అందరూ మరింత తెల్లబోయారు. ప్రసాద్ తమనింతగా మోసం చేసినందుకు రాజామణి తల్లిదండ్రులు, వారి తరపు బంధువులూ ఉగ్రులైపోయారు.

"ఈ విషయం నీకెవరు చెప్పారు మూర్తీ?'' అని రాజామణి తీక్షణంగా అడిగింది.

"పెళ్లికొడుకే చెప్పాడు. కావాలంటే మీరూ అడగండి. ఇప్పుడతని ముఖాన కత్తివాటుకు నెత్తురుచుక్కలేదు'' అని మూర్తి చెప్పగా-

"అయ్యో! చివరకు నేననుమానించిందంతా అయింది. రాజూ! ఇంతకీ కారకురాల్ని నేను. ఈ సమయంలో నేనిక్కడకు రాకపోయినట్లయితే ఈ విషయమంతా బయటపడేదికాదు. లక్షణంగా వివాహం జరిగిపోయేది. నావల్ల కలిగిన ఈ విఘ్నానికి వారు నన్నెన్నివిధాల శపిస్తున్నా



రోగదా. రాజు నా మూలంగా నీకు తీరని అపకారం జరిగింది'' అని అమ్మడు ఎప్పటికంటే ఎక్కువ విలపిస్తూ క్రమంగా యదార్థ విషయము నంతటినీ చెప్పేసింది.

“కాదు... తీరని అపకారం కాదు. నీరాకవల్ల ఇప్పుడు నాకు మహోప కారం జరిగింది. అమ్మడూ! ఇప్పుడు కాకపోతే ఈవిషయం మరికొంతకా లానికయినా తెలుస్తుందిగానీ మానదు. విద్యాధికుడై వుండి నీయెందెంతో ప్రేమను నటించి అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్యవు నీవుండగా నీ కంఠమును కోసి ఇప్పుడు నన్ను వివాహమాడడానికి తయారయిన నీచుడు, రేపు నా కంఠమును కూడా ఇలాగే కత్తిరించి మరియొక కన్యను చేపట్టడానికెందుకు సిద్ధపడడు? అమ్మడూ! ఈ ఉసురు నువ్వనుభవిస్తే ఒకటీ, నేననుభవిస్తే ఒకటీన్నీ కాదు. భగవంతుడు మన ఇద్దరయందునూ వుండబట్టే నువ్వు వేళకొచ్చావు.

నీ రాక ఒక్క అయిదు నిమిషాలు ఆలస్యమయిందంటే అందునుగు రించి మన రెండు ప్రాణాలూ ఆజన్మాంతమూ తీరని దుఃఖమనుభవించ వలసివచ్చేది. ఆపద గడచినందుకిది మనమిద్దరమూ సంతోషించవల సిన సమయంగాని దుఃఖపడవలసిన విషయం కాదు అమ్మడూ. హాలా హలమవబోతున్న నా జీవితంలో అమృతమును చిలికి పుణ్యముగట్టు కున్న దేవీమూర్తివి నువ్వు'' అని అనేక విధాల మెచ్చుకుని “నాన్నగారూ! ఇంకా చూస్తారేం! తనకు వివాహమయిందన్న విషయాన్ని కప్పివుచ్చి మనలనీ విధంగా వంచనచేసి అభముశుభము ఎరుగని కన్నెపడుచుల జీవితాలను దగ్ధపటలం చేయదల్చుకున్న ఆ స్వార్థపరుణ్ణింకా వేయినో ళ్లతో శపించరేం?'' అంటూ తండ్రిని హెచ్చరించింది.

అతడు కర్తవ్యమును ఊహించుకోలేక నిశ్చేష్టుడై కొయ్యబొమ్మలా గున నిలుచుండిపోయాడు. ప్రసాద్ ఎడల రాజామణికి అంతవరకూ వున్న ప్రేమ, అభిమానము, గౌరవమూ ఆ క్షణంలోనే మాసిపోయాయి. హాస్టల్ మేడమీద నిలుచుని అతన రాకకు ఎదురుతెన్నులు చూస్తూ అతని దర్శనానికి ఉవ్విళ్లూరిన ఆమె మనస్సిప్పుడాతని ముఖమున యినా చూడగోరడంలేదు.

ప్రసాద్ కంటబడగానే ప్రేమ వెన్నెలలు కురిపించిన ఆమె నేత్రద్వయ మిప్పుడు అగ్నివర్షమును కురిపిస్తోంది.

అతనిని వివాహమాడి ఆజన్మాంతమూ అతనితో దాంపత్యసౌఖ్యాన్ని అనుభవించడానికి ఉత్సాహపడిన ఆమె హృదయమిప్పుడు అతన్ని వేయివిధాలుగా శపిస్తోంది.

ప్రసాద్ నవమన్మథమూర్తి, అపర సౌందర్యావతారమూ అని స్తుతిం చిన ఆమె నాలుకే ఇప్పుడతన్ని స్వార్థపరుడు, మోసగాడు అని నిందించ సాహసించింది.

తోటి సోదరీమణి కుత్తుకను కత్తిరించి తన్ను మెరిపించచూచిన అతని నేమిచేసినా పాపంలేదని స్థిరపరచుకుంది.

అందరూ ఏమీ తోచక ఉన్మాదవస్థలో ఉన్న సమయంలో తోకతొ క్కిన ఆడతాచులాగా ఆమె ప్రసాద్ వున్న మేడమీదకి క్రోధమూర్తియై పరుగుపరుగున పోయింది.

ఆమె ఎటువంటి సాహసం చేస్తుందోనని అందరూ ఆమెననుసరిం చారు.

ప్రసాద్ ఇంకా పెళ్లి కొడుకు వేషంలోనే ఖిన్నుడై కూర్చున్నాడు. రాజా మణి నొసటన కరిగిపోయిన కళ్యాణరేఖలు అతని నొసటనింకా కరిగిపో లేదు. ఆమెయొక్క భయంకరరూపాన్ని చూసి ప్రసాద్ వణికిపోయాడు.

“ప్రసాద్! ఎప్పుడో బయటపడవలసిన నీ మాయాజాలం దైవవ శాత్తూ ఇప్పుడే బయటపడింది. ఈ విధంగా ఒకరి తరువాత ఒకరుగా ఎందరి కన్నెపడుచుల జీవితాలను నాశనం చేసి వారి కుత్తుకలను కత్తిరిం చబూనుకున్నావు? విద్యాధికుడివి, ప్రాజ్ఞుడివి, నువ్వే స్వార్థపరుడివై ఇటు వంటి ఘోరానికి పూనుకుంటే ఇంకేముంది?

అత్తవారు అయిదువేలు ఇవ్వలేదని అలిగి రెండో పెళ్లికి సిద్ధమవు తావా? ఇంతకంటే నీచమూ, స్వార్థపరత్వము ఇంకేమైనా ఉందా? రేపు మా నాయనగారే నువ్వు కోరిన గొంతెమ్మ కోరికలు తీర్చకపోతే నా పని కూడా ఇంతేకదా. అమ్మడి ధర్మమా అని నా భావి జీవితం నీవంటి స్వార్థ పరుడయిన పురుషస్పర్శవలన మలినం కాకుండా సంరక్షించబడింది.

అయిదువేలిస్తేగానీ కార్యం చేసుకోనని ఇంతకాలమూ భార్యనీవి ధంగా ఉసురుబెట్టడానికి నీ హృదయం రాయయినా అయి ఉండాలి, లేదా అంతకంటే కఠినమయిన దింకొకటయినా అయి ఉండాలి. చేసిన వాగ్దానంగాదట, ఋణంగాదట, దయధర్మ బిచ్చమడగడానికిదేనారీతి? ఇది నీకెవరు చెప్పిన నీతి? శ్రీపతిగారిని నేనెరుగుదును. అమ్మడు కోసం ఇంటికి వెళితే ప్రాణమిచ్చేవారు. అటువంటి ధర్మరాజును ఉసురుబెట్టిన నీ పాపానికి ప్రాయశ్చిత్తంలేదు. నీకీమాత్రం వివేకం లేకపోయింది. అతని కున్న ఆస్తినంతటినీ అనుభవించవలసిన వారెవరు? అమ్మడికన్నద మ్ములు లేరు, ఉన్నదొక్కపిల్ల. మీ ఇద్దరనూ గాదని వారనుభవించేదే ముంది? మనసారా ప్రేమించానన్నావు. నీ హృదయాది దేవతనని పొగి డావు. నేను కళ్లబడిననాడు పర్వదినమని బొంకావు. ఈ కపట నాటక మంతా ఎందుకో ఇప్పుడర్థమయింది. ఒకప్పుడీ కపట నాటకమునే నా స్నేహితురాలు అమ్మడి విషయంలో కూడా ఆడి వుంటావని ఎవరను కోరు!

స్వార్థం...నీలోని స్వార్థానికి అంతులేదు. మా నాన్నగారు లండన్ పంపి నీకు ఐసిఎస్ చెప్పిస్తానన్నారని ఈ పెళ్లికి సిద్ధపడ్డావని ఇప్పుడు తెలిసింది. ఇన్ని మోసాలు చేసి ఇందరినీవిధంగా ఉసురుబెట్టి నువ్వా లండన్‌కు వెళ్లకపోతే ఏమయింది?'' అని రాజామణి ఒక్క వరుసను గుక్క తిప్పుకోకుండా భయంకర కాళీమూర్తిలాగూన విజృంభించి తీవ్రంగా అడుగుతూ ఉంటే ప్రసాద్ ఒక్క మాటకయినా సమాధానం చెప్పలేదు. వంచిన తలనయినా ఎత్తలేదు.

మూర్తి కింద గదిలో వున్న అమ్మణ్ణి తీసుకువచ్చి అక్కడ నిలిపాడు. ప్రసాద్ ఆమె రెండు చేతులూ పట్టుకుని-

“అమ్మడూ! నేను నీకు చేసింది తీరని ద్రోహమే. అయినప్పటికీ నువ్వు నన్ను క్షమించక తప్పదు. నాకు గురుమాత అయి ఆదేశించిన రాజామణి పూజ్యురాలు'' అని ప్రసాద్ అన్నాడు.

“నాన్నగారూ! ఇప్పుడే శ్రీపతిగారికి టెలిగ్రాం ఇచ్చి రప్పించండి. పెళ్లికై చేయబడిన ఈ ఏర్పాటులన్నీ అమ్మడి కార్యానికి వినియోగించబ డతాయి'' అంటూ రాజామణి అమ్మడిని దగ్గరకు తీసుకుంది. అప్పుడు మాత్రం ప్రసాద్ ముఖంలోకి వికాసం వచ్చింది. ఆ విషయమును గమ నించిన మూర్తి అతని చేయి పట్టుకుని-

“ఓయ్... నీ అసాధ్యంగూల! ఎంత పని చేసావోయ్.. ఈ అబద్ధం పెళ్లికి ఇంత అట్టహాసమెందుకూ... తీసేయ్ ఈ వేషం!'' అని ఆ మాటల కందరూ నవ్వుతూ ఉన్న సమయంలో ప్రసాద్‌నక్కడనుంచి తీసుకుపో యాడు.

-సమాప్తం-